ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
ఆదివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 35.3 | కనిష్ఠం 26.7
ఆదిలాబాద్
జిల్లా వార్తలు
5
సోమవారం 21 జులై 2025



బ్రహ్మ కమలంకు పూజలు చేస్తున్న దృశ్యం

బోథ్‌లో వికసించిన బ్రహ్మ కమలం

బోథ్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): బోత్ మండల కేంద్రానికి చెందిన రాయిపల్లి నందన మధుకర్ ఇంట్లో పెంచిన బ్రహ్మ కమలం మొక్కకు ఆదివారం బ్రహ్మ కమలం పుష్పం వికసించింది. మూడు సంవత్సరాల క్రితం నార్నూర్ నుంచి తీసుకు వచ్చి నాటామని ఇంటి యజమాని మధుకర్ తెలిపారు. పవిత్రమైన ఈ పువ్వు పూసింది అని తెలియడంతో భారీ సంఖ్యలో జనం వచ్చి పూజలు చేయడం జరిగింది. ఇది హిమాలయ పర్వత ప్రాంతాల్లో ఎక్కువగా పూస్తుందని, శివలింగంపై పెట్టి ప్రత్యేక పూజలు చేస్తారని పండితులు పేర్కొంటున్నారు. అంతేకాకుండా జూలై నుంచి సెప్టెంబరు నెలలో మధ్యలో ఈ బ్రహ్మ కమలం వికసిస్తుందని, దీని మొక్కను వివిధ రకాల వ్యాధులకు ఉపయోగిస్తుంటారు. రాత్రిపూట వికసించే ఈ పువ్వును రాత్రి రాణి అంటారని మధుకర్ పేర్కొన్నారు.

ఉట్నూర్‌లో మెగా జాబ్ మేళా

ఆదిలాబాద్ టౌన్, జూలై 20(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో ఈ నెల 25వ తేదీన ఉట్నూర్‌లో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఆత్రం సుగుణ తెలిపారు. ఆదివారం స్థానిక ప్రజాసేవా భవన్ లో జీసీసీ చైర్మన్ కొట్నాక్ తిరుపతి, కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి లతో కలిసి జాబ్ మేళా కరపత్రాలు విడుదల చేశారు. జిల్లాలోని నిరుద్యోగులకు వివిధ సంస్థల్లో ఉద్యోగాలు కల్పించేందుకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. జాతీయ, అంతర్జాతీయ సంస్థలు మేళాలో పాల్గొంటాయని, ఉట్నూర్ లోని జెసిఎన్ ఫంక్షన్ హాల్లో ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. గత ప్రభుత్వం ఇంటికో ఉద్యోగం పేరు చెప్పి నిరుద్యోగులను మోసం చేసిందని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే వేల ఉద్యోగాలు కల్పించిందని గుర్తు చేశారు. తాజాగా నిర్వహించే జాబ్ మేళాలో అంతర్జాతీయ సంస్థలు కూడా పాల్గొనడం తెలిసారని, ఈ సదవకాశాన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు.

నార్నూర్: ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి కల్పించడమే ధ్యేయంగా టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క నిర్వహిస్తున్న మెగా జాబ్ మేళాను విజయవంతం చేయాలని షేక్ మొహమ్మద్ నార్నూర్ మండల యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు షేక్ మొహమ్మద్ అన్నారు. మండలకేంద్రంలో ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.

నియోజకవర్గ అభివృద్ధికి నిధులు ఇవ్వండి : ఆత్మ చైర్మన్

బోథ్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): బోథ్ నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావును బూత్ బ్లాక్ ఆత్మ చైర్మన్ గొర్ల రాజు యాదవ్ ఆదివారం కోరారు. ఆత్మ చైర్మన్ గా నియమించిన తర్వాత మంత్రిని మర్యాదపూర్వకంగా కలవడం జరిగిందని ఆయన పేర్కొన్నారు జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని విన్నవించామన్నారు అంతేగాక ప్రస్తుతం ఉన్న రాజకీయ పరిస్థితుల గురించి అడిగి తెలుసుకున్నారు అని పేర్కొన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలని మంత్రి సూచించడం జరిగిందని ఆయన పేర్కొన్నారు.

టీఏజీఎస్ నుంచి కనక మలుకు బహిష్కరణ : జిల్లా అధ్యక్షుడు

ఉట్నూర్, జూలై 20(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం (టీఏజీఎస్) నుంచి ఉట్నూర్ మండల అధ్యక్షుడిగా పని చేస్తున్న కనక మలుకును సంఘం నుంచి బహిష్కరణ చేస్తున్నట్లు తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు ఉయిక విష్ణు పేర్కొన్నారు. ఆదివారం ఉట్నూర్ మండల కేంద్రంలోని ఆదివాసీ భవన్‌లో సంఘం జిల్లా కమిటీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సంఘం నియమ నిబంధనలకు వ్యతిరేకంగా, క్రమశిక్షణకు వ్యతిరేకంగా ఆయన పని ఉన్నందున సంఘం నుంచి బహిష్కరణ చేస్తున్నట్లు తెలిపారు. ఈ రోజు నుంచి ఆయనకు సంఘానికి ఎటువంటి సంబంధం లేదని ఆదివాసీ ప్రజలు, విద్యార్థులు గమనించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఆత్రం తనుష్, మండల కార్యదర్శి మడావి నాగోరావు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

రైతుల ఖాతాల్లో పంట నగదు జమ

ఆదిలాబాద్ టౌన్, జూలై 20(ఆంధ్రజ్యోతి): మార్క్ ఫెడ్ ఆధ్వర్యంలో జొన్న పంటను కొనుగోలు చేసిన నేపథ్యంలో రైతులకు సంబంధించిన పంట నగదు వారి ఖాతాల్లో జమ అయిందని జిల్లా కలెక్టర్ రాజర్షిషా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనిలో భాగంగా జొన్న పంటను ప్రభుత్వ మద్దతు ధర క్వింటాలుకు రూ.3371కు కొనుగోలు చేయగా.. ఇప్పటివరకు రూ.188.83 కోట్లు విడుదలయ్యాయని ఆయన పేర్కొన్నారు. జిల్లాలో జొన్నలు అమ్మిన 19,285 మంది రైతులకు విడతల వారీగా ఖాతాల్లో నగదు జమ అయ్యిందని, ఈ విషయాన్ని రైతులు గమనించాలని సూచించారు.

మంత్రి సీతక్కకు మాజీ ఎంపీ ఆహ్వానం

ఆదిలాబాద్ టౌన్, జూలై 20(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్టీయూ భవన్‌లో ఈనెల 27వ తేదీన మాజీ ఎంపీ సోయం బాపురావు రాజ్ గోండ్ సేవ సమితి రాష్ట్ర అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేయనున్న నేపథ్యంలో కార్యక్రమానికి రావాలని హాజరు కావాలని మంత్రి సీతక్కకు ఆహ్వాన పత్రిక అందించారు. ఈ సందర్భంగా మంత్రి ఆయనను శాలువాతో సత్కరించారు. కాగా మంత్రి సీతక్క కార్యక్రమానికి హాజరు అవుతారని తెలిపినట్లు సోయం బాపూరావు తెలిపారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, కరీంనగర్ గ్రంథాలయ చైర్మన్ సత్తు మల్లేష్, అక్కెపెల్లి లక్ష్మణ్ ఉన్నారు.



మంత్రి సీతక్కకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న సోయం



- జిల్లాలో మధ్యాహ్న భోజన కార్మికుల వెతలు
- అరువుపై సరుకులు తెస్తున్న వైనం
- నిత్యం మెనూ ప్రకారం విద్యార్థులకు పౌష్టికాహారం
- బిల్లులు రాక అప్పుల పాలవుతున్న కార్మికులు
- జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో 55 వేలకు పైగా మంది విద్యార్థులు

ప్రభుత్వానికి గొప్పలు.. కార్మికుల తిప్పలు!

ఉట్నూర్, జూలై 20(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు ప్రభుత్వం అమలు చేస్తున్న మధ్యాహ్న భోజనం పథకం ఆశయం గొప్పదే అయినా.. కార్మికులకు మాత్రం అప్పుల పాలు తప్పడం లేదు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం మెరుగు పర్చడంతో పాటు విద్యార్థులకు పౌష్టికరమైన ఆహారం అందించడానికి ప్రభుత్వం కృషి చేస్తుంది. ప్రతియేటా మధ్యాహ్న భోజనం వండి పెడుతున్న కార్మికులకు మాత్రం సరైన విధంగా బిల్లులు అందించక పోతుండడంతో మహిళా కార్మికులు అరువుపై సరుకులు తెచ్చి విద్యార్థుల ఆకలి తీరుస్తూ అప్పుల్లో కూరుకుపోతున్నారు. ఒక ఉట్నూర్ మండలంలోనే షాంపూర్, హస్నాపూర్, ఏందా, సాలెవాడ, దంతనపల్లి, పెర్కగూడ, ఉట్నూర్ తెలుగు మీడియం, ఉట్నూర్ బాలికలు, ఉట్నూర్ ఉర్దూ మీడియం ఉన్నత పాఠశాలలను కలుపుకొని ఆదిలాబాద్ జిల్లాలోని 20 మండలాల్లో ప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలు మొత్తం 692 ఉన్నాయి. ఈ పాఠశాలల్లో సుమారు 55,600 మందికి పైగా విద్యార్థినీ, విద్యార్థులు చదువుకుంటున్నారు. అలాగే గిరిజన సంక్షేమ శాఖకు చెందిన 502 ప్రాథమిక పాఠశాలల్లో కూడా మధ్యాహ్న భోజనం పథకం అమలులో ఉంది. వారానికి మూడు సార్లు ఉడికించిన కోడిగుడ్లు పెట్టడంతో పాటు కూరగాయలు, పప్పు, ఆకు కూరలు వండిపెట్టేలా ప్రభుత్వం మెనూ సైతం ప్రకటించింది. ఆరవ తరగతి నుంచి తొమ్మిదవ తరగతి వరకు చదువుకుంటున్న ఒక్కొక్క విద్యార్థికి రోజుకు రూ.9.29, అలాగే పదవ తరగతి విద్యార్థులకు రూ.10.67 ప్రభుత్వం చెల్లిస్తుంది.

మెనూ ప్రకటించిన విద్యా శాఖ

వారం రోజుల పాటు విద్యార్థులకు ప్రతీరోజు ఎలాంటి భోజనం అందించాలో విద్యా శాఖ మెనూ ప్రకటించింది. ఈ మెనూ ప్రకారం సోమవారం కిచిడి, కూరగాయలతో కలిసిన భోజనం మరియు ఉడికించిన గుడ్లు, మంగళవారం అన్నం, సాంబారు, మిక్స్ విజిటేబుల్ కర్రీ, బుధవారం అన్నం, ఆకుకూరలు మరియు మిక్స్ వెజిటేబుల్ కరితో పాటు ఉడికించిన గుడ్డు, గురువారం రాగి జావా, వెజిటేబుల్ బిర్యాని, మిక్స్ వెజిటేబుల్ కర్రీ, శుక్రవారం అన్నం, సాంబారు, మిక్స్ విజిటేబుల్ కర్రీ మరియు ఉడికించిన గుడ్డు, శనివారం రాగి జావా, అన్నం, ఆకుకూరలు మరియు మిక్స్ వెజిటేబుల్ కర్రీ అందించాలని ఆదేశించంది. దీంతో మధ్యాహ్న భోజన కార్మికులు అనేక ఇబ్బందులకు గురవుతూ.. సకాలంలో బిల్లులు రాకపోయినా షావుకారుల దగ్గర అప్పులు చేసి విద్యార్థులకు ప్రభుత్వం ప్రకటించిన మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారు.

బిల్లులు రాక అప్పుల పాలు

ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వండి పెడుతున్న

(వివరాలు 6వ పేజీలో...)

బిల్లులు రాక తీవ్ర ఇబ్బందులు

: రాధా, ఎండీఎం కార్మికురాలు, ఉట్నూర్



మధ్యాహ్న భోజనం వండి పెడుతున్న మాకు సకాలంలో ప్రభుత్వం బిల్లులు ఇవ్వక పోవడం వల్ల ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. చాలీ చాలని గౌరవ వేతనంపై జీవిస్తున్న తాము షావుకారుల వద్ద అప్పులు చేసి ఎండీఎం అమలు చేస్తున్నాం. ప్రభుత్వం వెంటనే మాకు సకాలంలో బిల్లులు అందించి ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అప్పుల పాలు అవుతున్నాం

: జ్యోతి, ఎండీఎం కార్మికురాలు, గంగన్నపేట్



గంగన్నపేట ప్రాథమిక పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తున్నాం. ప్రభుత్వం గత కొన్ని నెలలుగా నిధులు ఇవ్వక పోయినా.. అప్పులు చేసి కూరగాయలు కోడిగుడ్లు, వంట సామగ్రి తెచ్చి విద్యార్థులకు భోజనం అందిస్తున్నాం. మాకు అందించే గౌరవ వేతనంతో పాటు బిల్లులు కూడా సకాలంలో అందిస్తే బాగుంటుంది.

గౌరవ వేతనంతో పాటు బిల్లులు మెల్లగా వస్తున్నాయి

: ఆశన్న, మండల విద్యా శాఖ అధికారి, ఉట్నూర్



ప్రభుత్వ పాఠశాలలో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజనం కార్మికులకు బిల్లులు, గౌరవ వేతనాలు మెల్లమెల్లగా వస్తున్నాయి. ఫిబ్రవరి, మార్చిలకు సంబంధించిన ఎండీఎం కార్మికుల గౌరవ వేతనం శనివారం కార్మికుల ఖాతాల్లో జమ అయ్యింది. మధ్యాహ్న భోజనం బిల్లులు కూడా త్వరలోనే పూర్తిగా వస్తాయి.



సిడాంశంభు సమాధి వద్ద నివాళులు అర్పిస్తున్న ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు, గిరిజన సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు

సిడాం శంభును స్ఫూర్తిగా తీసుకోవాలి

- ఎమ్మెల్యే బొజ్జు పటేల్
- మత్తడిగూడలో శంభు వర్ధంతి

ఉట్నూర్, జూలై 20(ఆంధ్రజ్యోతి): జల్, జంగల, జమీన్ కోసం నిజాం సైన్యంతో కొమురంభీం పోరాడిన విధంగానే ఆదివాసీల హక్కుల కోసం నిరంతర పోరాటాలు జరిపిన మహనీయుడు సిడాం శంభు అని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్ అన్నారు. ఆదివారం మండలంలోని మత్తడిగూడలో అమరుడు శంభు కుటుంబ సభ్యులు ఏర్పాటు చేసిన ఏడవ వర్ధంతి కార్యక్రమానికి హజరై శంభు సమాధి వద్ద పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసీల హక్కుల సాధన కోసం పోరాడిన విధంగానే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం ఉద్యమించిన మహా నాయకుడు అని అన్నారు. ఆదివాసీలకు భూమిపై హక్కుల కోసం రాష్ట్ర రాజధానితో పాటు దేశ రాజధాని వరకు వెళ్లి ఉద్యమాలు నడిపి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకువెళ్లి అటవి హక్కుల సాధన కోసం కృషి చేశారన్నారు. అలాగే, బీజేపీ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు రితేష్‌రాథోడ్ తన అనుచరులతో అక్కడికి చేరుకుని శంభు సమాధి వద్ద నివాళులు అర్పించారు. ఇందులో తుడుందెబ్బ రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షుడు గొడం గణేష్, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పురకబాపురావు, జిల్లా అధ్యక్షుడు పెందూరుదాదిరావు, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ రాథోడ్‌జనార్ధన్, మాజీ జడ్పీటీసీ చారులత, జిల్లా రాయిసెంటర్ అధ్యక్షుడు మేస్రం దుర్గు, తదితరులు పాల్గొన్నారు.

నేటి బంద్‌కు మద్దతు : వివిధ సంఘాలు

ఉట్నూర్, జూలై 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో 49ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం తలపెట్టిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బందుకు సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు గ్రామీణ పేదల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నేతావత్ రాందాస్‌నాయక్, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నిర్మల్ జిల్లా కార్యదర్శి బి.రాజు, రైతు కూలీ సంఘం నిర్మల్ ఆదిలాబాద్ జిల్లా కార్యదర్శి కె.సర్ధార్, ప్రజా సంఘాల జేఏసీ ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా శాఖ అధ్యక్షుడు బానోతు రామారావులు ఆదివారం ప్రకటించారు. ఉట్నూర్‌లో నిర్వహించిన సమావేశంలో పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి వినోద్, డీఎస్‌వో ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి సుభాష్, గ్రామీణ పేదల సంఘం ఆసిఫాబాద్ కొమురంభీం జిల్లా కార్యదర్శి సిడాందర్ము, దారిగుల ఎల్లయ్య, జిల్లా కార్యదర్శి కేశవ్, రైతు కూలీ సంఘం ఉట్నూర్ డివిజన్ కార్యదర్శి, తదితరులు పాల్గొన్నారు.

- **నేటి బంద్ ను విజయవంతం చేయాలి**

సిరికొండ: ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ), కొమురం భీం ఆశయ సాధన కమిటీ, ఆదివాసీ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో సోమవారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా చేపట్టే బంద్ ను విజయవంతం చేయాలని తుడుందెబ్బ మండలాధ్యక్షుడు కుమ్ర యాదవ్ రావ్, కొమురం భీం ఆశయ సాధన కమిటీ మండల అధ్యక్షులు కోట్నాక్ పాండు పిలుపునిచ్చారు. శనివారం సిరికొండ మండల కేంద్రంలో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు.

‘విద్యలో రాణించినప్పుడే మంచి గుర్తింపు’

నేరడిగొండ, జూలై 20(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు విద్యలో రాణించినప్పుడే మంచి గుర్తింపు లభిస్తుందని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. ఆదివారం మండలంలోని బుగ్గారం (బి) గ్రామానికి చెందిన రాథోడ్ లావణ్య ఐఐటీ ఆల్ ఇండియా 803 ర్యాంక్ సాధించిన సందర్భంగా.. నేరడిగొండ మండల కేంద్రంలో గల ఎమ్మెల్యే నివాసంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ శాలువాతో సన్మానించి అభినందించారు. మున్ముందు ఇలాగే మంచి ర్యాంక్‌లు సాధించాలని తమ అండ ఎప్పుడూ ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాల నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ భగ్గుమన్న కేశవపట్నం

- పోడు భూముల్లో ప్లాంటేషన్ కోసం వెళ్లిన అధికారులు
- రాళ్లతో ముల్తానీల మూకుమ్మడి దాడి
- భద్రత కోసం వెళ్లిన పోలీసులను వెంబడించి మరీ దాడి
- ఇచ్చోడ ఎస్సైతో సహా 8 మంది పోలీసులకు గాయాలు
- పరిస్థితిని సమీక్షించిన ఎస్పీ అఖిల్ మహాజన్



కేశవపట్నంలో భారీగా మోహరించిన పోలీసులు



అటవీ అధికారులకు పలు సూచనలు చేస్తున్న ఉన్నతాధికారులు

ఇచ్చోడ, జులై 20(ఆంధ్రజ్యోతి): పదే పదే వివాదాల్లో నిలిచే కేశవపట్నం గ్రామం మళ్లీ వార్తల్లో నిలిచింది. గత రెండ్రోజులుగా అటవీ భూముల్లో మొక్కలు నాటుతున్న అటవీ అధికారుల భద్రత కోసం వెళ్లిన పోలీసులపై ఆ గ్రామ పోడు రైతులంతా (అక్కడి ప్రాంత ముల్తానీలు) దాడికి దిగడం తీవ్ర చర్చనీయాంశమైంది. వివరాల్లోకి వెళితే.. ఇచ్చోడ మండలంలోని కేశవపట్నం గ్రామంలో ఆదివారం పోలీసులపై ముల్తానీలు ముకుమ్మడి రాళ్ల దాడి చేశారు. ఈ ఘటనలో దాదాపు 9 మంది పోలీసులు తీవ్ర గాయాలపాలయ్యారు. దీంతో ఆ ప్రాంతమంతా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ప్రతియేటా అటవీ ప్రాంతంలో అటవీ అధికారులు మొక్కలు నాటుతుంటారు. నాటిన మొక్కలను అక్కడి ప్రాంత ముల్తానీలు (పోడు రైతులు) పీకేసి ఆ భూములు మావేనని మా భూముల్లో మొక్కలు నాటవద్దని అటవీ అధికారులతో వాగ్వాదాకి దిగుతూ.. వివాదం చోటు చేసుకుంటుంది. శనివారం సిరిచెల్మ అటవీ రేంజ్ పరిధిలోని కేశవపట్నం అటవీ ప్రాంతంలోని 172, 174 కంపార్మెంట్ పరిధిలో అటవీ అధికారులకు భద్రత కోసం అటవీ ప్రాంతంలో భూములు సాగు చేస్తున్న ముల్తానీ రైతులను పోలీసులు, అటవీ అధికారులు అడ్డుకుని ప్రభుత్వ భూముల్లోకి రావద్దని వివరించారు. ఈ భూములు మావేనని అక్కడి రైతులు సమాధానం ఇవ్వడంతో పోలీసులు ఈ భూములకు సంబంధించిన పత్రాలు చూపించమని మహిళా రైతులను ప్రశ్నించారు. మా భూముల జోలికి వస్తే ఇక్కడే కొడవళ్లతో ఆత్మహత్యలు చేసుకుంటామని మహిళా రైతులు అధికారులతో వాగ్వాదానికి దిగారు. దీంతో గ్రామస్థులంతా ఏకమై ఆదివారం గ్రామానికి వెళ్లిన పోలీసులపై మూకుమ్మడి దాడి చేసి బీభత్సం సృష్టించారు. ఈ మేరకు పోలీసులు, అటవీశాఖ అధికారులు చర్చలు జరుపుతున్నారు. విషయం తెలుసుకున్న ఎస్పీ అఖిల్ మహాజన్ మధ్యాహ్నం ఇచ్చోడ పోలీస్ స్టేషన్‌కు చేరుకుని పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ.. పోడు భూముల సమస్యపై అటవీ అధికారులతో చర్చలను కొనసాగించారు.



ఆర్డీవోను సన్మానిస్తున్న జిల్లా కలెక్టర్, అధికారులు

ఆర్డీవో వినోద్‌కుమార్‌కు ఘన వీడ్కోలు

ఆదిలాబాద్ టౌన్, జూలై 20(ఆంధ్రజ్యోతి): బదిలీపై వెళ్తున్న ఆర్డీవో తిరుకోవెల వినోద్ కుమార్‌కు కలెక్టర్ రాజర్షి షా, రెవెన్యూ అధికారులు ఘనంగా వీడ్కోలు పాలికారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సన్మాన సభలో ఆయనను సన్మానించి అభినందనలు తెలిపారు. భావి జీవితం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, సబ్ కలెక్టర్ యువరాజ్, ట్రైనీ కలెక్టర్ సలోని చాబ్రా, తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

- **జిల్లా ప్రజలకు బోనాల పండుగ శుభాకాంక్షలు**

ఆదిలాబాద్ టౌన్: బోనాల పండుగ సందర్భంగా ఈనెల 21న జరిపే ప్రజావాణి రద్దు చేసినట్లు కలెక్టర్ రాజర్షి షా ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని సూచించారు. జిల్లా ప్రజలకు పండుగ శుభాకాంక్షలు తెలిపిన ఆయన.. భక్తిశ్రద్ధలతో, ఆనందంగా వేడుకలు జరుపుకోవాలని సూచించారు. కాగా, 28వ తేదీన తిరిగి యధావిధిగా ప్రజావాణి ఉంటుందని కలెక్టర్ పేర్కొన్నారు.

గెస్ట్ లెక్చరర్స్ ఉద్యోగాలకు దరఖాస్తులు

ఉట్నూర్, జూలై 20(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కొమురంభీం ప్రాంగణంలో ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2025-26 విద్య సంవత్సరానికి ఖాళీగా ఉన్న అతిథి అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ టి.ప్రతాప్‌సింగ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కామర్స్ 3,కంప్యూటర్ సైన్స్/అప్లికేషన్ 3, ఎకనామిక్స్ 3, ఇంగ్లీష్ 4, హిందీ 1, హిస్టరీ 2, గణితం 2, భౌతిక శాస్త్రం 2, పొలిటికల్ సైన్స్ 3, తెలుగు 4, జువాలజి 2, సబ్జెక్టులలో ఖాళీలు ఉన్నాయని,అభ్యర్థులు సంబంధిత పీజీలో 55శాతం మార్కులున్న వారు అర్హులన్నారు. నెట్, సెట్, పీహెచ్‌డీ కలిగిన అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందని, బోధన అనుభవం ఉన్న అభ్యర్థులు సంబంధిత ధృవపత్రం సమర్పిస్తే వెయిటేజీ ఉంటుందన్నారు. అర్హులైన అభ్యర్థులు తగిన ధృవపత్రాలతో ఈ నెల 23 లోగా కళాశాలలో దరఖాస్తులు సమర్పించాలని, ఈనెల 24న ఉదయం 10.30 గంటలకు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల సైన్సెస్‌లో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు, అయితే ఇంటర్వ్యూలకు వచ్చే వారు ఒరిజినల్ సర్టిఫికెట్స్ వెంట తీసుకు రావాలని పేర్కొన్నారు.

ఐదు కిలో మీటర్లు నడిచి ఆరోగ్య సేవలు

ఆదిలాబాద్ రూరల్, జూలై 20(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ రూరల్ మండలంలోని అంకోలి పీహెచ్‌సీ పరిధిలోని బుర్కి గ్రామంలో మెడికల్ క్యాంపు, ర్యాపిడ్ ఫీవర్ సర్వే నిర్వహించారు. ఈ సర్వేలో బాగంగా హెల్త్ అసిస్టెంట్ ప్రేమ్‌సింగ్ ప్రజలకు సీజనల్ జబ్బుల పై అవగాహన కల్పించి, జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆరోగ్య కార్యకర్త ఐదు కి.మీ.లు దాటి దారులేని కొండల మధ్య నడిచి దుర్భర మార్గాల్లో ప్రయాణించి ఆదివాసీ గ్రామానికి చేరుకుని ఆరోగ్య సేవలు అందించారు. ఇది వారి సేవా భావానికి గొప్ప ఉదాహరణ అని ప్రజలు వారి సేవలను అభినందించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ ప్రేమ్‌సింగ్, ఏఎన్ఎం ముయ్యాల మోతి, ఆశావర్కర్ ధానుబాయి పాల్గొన్నారు.

కేజీబీవీలో స్పాట్ అడ్మిషన్లు

సిరికొండ, జూలై 20(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలోని కళాశాల మరియు పాఠశాలలో మిగిలిపోయిన సీట్లకు స్పాట్ అడ్మిషన్‌లు నిర్వహిస్తున్నామని కళాశాల ప్రత్యేక అధికారిణి సంధ్యారాణి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎంపీసీ విభాగంలో 30 సీట్లు, బైపీసీ విభాగంలో 20 సీట్లు, అలాగే పాఠశాలలో ఆరవ తరగతిలో 10 సీట్లు, ఏడవ తరగతిలో మూడు సీట్లు ఖాళీలు ఉన్నాయని ఆమె తెలిపారు. ఆసక్తి కల్గిన విద్యార్థినులు తమ నిజ ధ్రువీకరణ పత్రాలతో సోమవారం సిరికొండ కేజీబీవీలో సంప్రదించాలని ఆమె కోరారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల పరిశీలన

నార్నూర్, జూలై 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను గృహ నిర్మాణ శాఖ హైదరాబాద్ సూపరింటెండెంట్ ఆఫ్ ఇంజనీర్ కార్యాలయం అధికారి ఎస్ఈ బలరాం మండలంలోని బాబేఝరి గ్రామానికి వెళ్లి పరిశీలించారు. లబ్ధిదారులను వివరాలను అడిగి తెలుసుకున్నారు. పనులు జరిగే ప్రతి ఇంటి సమాచారం సేకరించి.. సంబంధిత అంశాలపై సంతృప్తి వ్యక్తం చేశారు ఆయన వెంట మండల గృహ నిర్మాణ శాఖ దుర్గం శ్రీకాంత్, పంచాయతీ కార్యదర్శి మెస్రం విజయ్ కుమార్, గ్రామస్థులు ఉన్నారు.

'నిరుపేదలకు అండగా సంక్షేమ పథకాలు'

ఆదిలాబాద్ టౌన్, జూలై 20(ఆంధ్రజ్యోతి): పేద, బలహీన వర్గాల సంకోసం కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. పేదల వైద్యఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి వచ్చిన చెక్కులను ఆదివారం క్యాంపు కార్యాలయం ప్రజాసేవభవన్‌లో లబ్ధిదారులకు అందించారు. నియోజకవర్గానికి చెందిన పలువురు లబ్ధిదారులకు రూ.5 లక్షల 27,500 విలువైన చెక్కులు పంపిణీ చేశారు. జీసీసీ చైర్మన్ కొట్నాక తిరుపతి, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నర్సయ్య, టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఆత్రం సుగుణ పాల్గొన్నారు.

ఆదిలాబాద్ టౌన్: ఆదిలాబాద్ నియోజక వర్గ అభివృద్ధికి రాష్ట్రంలో గత పదేళ్లు పాలించిన బీఆర్ఎస్, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ చేసిందేమీ లేదని జీసీసీ చైర్మన్ కొట్నాక తిరుపతి, టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఆత్రం సుగుణ, కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి విమర్శించారు. ఆదివారం సాత్నాల మండలం సయిద్ పూర్‌లో తుమ్రం చంద్ర షావ్ ఆధ్వర్యంలో జరిగిన చేరికల కార్యక్రమానికి వారు హాజరయ్యారు. గ్రామస్తులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు వారికి డప్పు చప్పుళ్లతో ఘన స్వాగతం పలికారు. ముందుగా గ్రామంలోని కొమురం భీం విగ్రహానికి పూల మాలలు వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు వచ్చిన దాదాపు వంద మందికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు.

తండ్రిని కొట్టి చంపేస్తానని బెదిరించిన యువకుడిపై కేసు నమోదు

ఆదిలాబాద్ టౌన్, జూలై 20(ఆంధ్రజ్యోతి): సొంత తండ్రినే కొట్టి చంపేస్తానని బెదిరించి.. అడ్డుగా వచ్చిన తల్లితో సైతం వివాదం పెట్టుకున్న యువకుడిపై కేసు నమోదు చేసినట్లు టూ టౌన్ సీ.ఐ కరుణాకర్ రావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో ఇంద్రానగర్ లో నివసిస్తున్న నిందితుడు చిలకల ప్రణీత్ అలియాస్ సిద్దు అనే యువకుడు తండ్రి శ్రీనివాస్ తో గొడవకు దిగి కొట్టాడు. అడ్డుగా వచ్చిన తల్లిని సైతం బెదిరించాడు. అక్కడే ఉన్న పెద్ద అద్దం ముక్కను కింద పడేసి దానితో చంపేస్తానని బెదిరించాడు. తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

మహిళా సమాఖ్య నిధుల గోల్‌మాల్!!

బోథ్, జూలై 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని మరల పెళ్లి గ్రామంలోనీ వైభవలక్ష్మి మహిళా సమాఖ్య మూడు లక్షల 50 వేల రూపాయలు వక్ర మార్గం పట్టినట్లు తెలిసింది. అయితే నెలనెలా బ్యాంకులో జమ చేయాల్సిన ఈ డబ్బును బ్యాంకులో వేయకుండా మహిళా సంఘం ప్రతినిధి ఒకరు స్వాహ చేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి. దీంతో మహిళా గ్రూపులో ఆందోళన నెలకొంది. పంచాయితీ నిర్వహించి.. నిధుల దుర్వినియోగంపై గ్రామంలో సంబంధిత గ్రూపు వారు పంచాయితీ నిర్వహించి నట్లు తెలిసింది. అదే దుర్వినియోగమైన నిధులను చెల్లిస్తానని గ్రూపు ప్రతినిధి వివరించినా మిగతా సభ్యులు ఒప్పుకోలేదని సమాచారం.. పర్యవేక్షణ లోపం.. మహిళా సంఘాల గ్రూపుల నిర్వహణపై గ్రామస్థాయిలో పర్యవేక్షణ లోపం కనిపిస్తుందని పలువురు పేర్కొంటున్నారు అంతేగాక సీసీలు నెలనెలా మహిళా సంఘాల వారితో సమావేశం ఏర్పాటు చేసి ఉంటే ఈ సమస్య వచ్చేది కాదని గ్రూపు సభ్యులు వాపోతున్నారు ఏది ఏమైనా నిధుల దుర్వినియోగం మరికొన్ని గ్రామాల్లో ఫలితం బయటపడే ఆస్కారం ఉందని తెలిసింది.

నిరుపేదల పెన్నిధి సీఆర్ఆర్

● కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి



సీఆర్ఆర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ఆదిలాబాద్ టౌన్, జూలై 20(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి దివంగత చిలుకూరి రామచంద్రారెడ్డి నిరుపేదల పాలిట పెన్నిధి అని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక ప్రజాసేవా భవన్‌లో సీఆర్ఆర్ వర్ధంతి కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా సీఆర్ఆర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కంది మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతం కోసం జీవితాంతం శ్రమించిన గొప్ప నాయకుడు సీఆర్ఆర్ అని కొనియాడారు. ఇందులో జీసీసీ చైర్మన్ కొట్నాక తిరుపతి, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నర్సయ్య, టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఆత్రం సుగుణ, సెడ్మకె ఆనంద రావు, భూపల్లి శ్రీధర్, గుడిపల్లి నగేష్, గిమ్‌సంతోష్, సామ రూపేష్ రెడ్డి, తదితరులున్నారు.

ఆదిలాబాద్ టౌన్: మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు చిలుకూరి రామచంద్రారెడ్డి ద్వితీయ వర్ధంతిని పురస్కరించుకొని పట్టణంలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాజీ టీపీసీసీ జనరల్ సెక్రటరీ గండ్రత్ సుజాత, మాజీ డీసీసీ అధ్యక్షులు సాజిద్ ఖాన్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ అల్లూరి సంజీవ్ రెడ్డితోపాటు పలువురు నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు.

● ప్రజల గుండెల్లో చిరస్మరణీయుడు : బోరంచు

మావల: దివంగత నేత మాజీ మంత్రి చిలుకూరి రామచంద్రారెడ్డి జిల్లా ప్రజల గుండెల్లో చిరస్మరణీయుడు, మరిచిపోలేని మహానేత అని తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి పేర్కొన్నారు. మాజీ మంత్రి రామచంద్రా రెడ్డి ద్వితీయ వర్ధంతి కార్యక్రమాన్ని మండల కేంద్రంలో బోరంచు శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఆయన నివాసంలో నిర్వహించారు. ఈ మేరకు కాంగ్రెస్ నేతలు సీఆర్ఆర్ గారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వారు చేసిన సేవలను కొనియాడుతూ జోహార్ సీఆర్ఆర్ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడారు. ఇందులో కాంగ్రెస్ మావల మండల అధ్యక్షుడు ధర్మపురి చంద్రశేఖర్, సిరికొండ మండల అధ్యక్షుడు షేక్ ఇమామ్, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి వేముల నాగరాజు, మాజీ వైస్ ఎంపీపీ అట్ల గోవర్ధన్ రెడ్డి, తదితరులున్నారు.

ప్రాణం తీసిన వరకట్న వేధింపులు



చిట్టి (ఫైల్)

సిరికొండ, జూలై 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని లచ్చింపూర్(కే) గ్రామంలో వరకట్న వేధింపులు తాళలేక శనివారం వారం రాత్రి ఓ వివాహిత పురుగుల మందు తాగి బలవన్మరణానికి పాల్పడింది. సిరికొండ ఎస్సై పూజ, గ్రామస్థులు, కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. మండల పరిధిలోని వాయిపేట్ గ్రామానికి చెందిన గురిజెల భీమవ్వ-శంకర్ దంపతుల పెద్ద కుమార్తె గురిజెల చిట్టి(19), పోచంపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని లచ్చింపూర్(కే) గ్రామానికి చెందిన మోకాషీ లక్ష్మి-లక్ష్మణ్ దంపతుల కుమారుడు మోకాషీ అజిపాల్(20) ఇద్దరు మూడు నెలల క్రితం ప్రేమించుకుని, పెద్ద మనుషుల సమక్షంలో పెళ్లి చేసుకున్నారు. వివాహ సమయంలో వరకట్నం కింద మోటార్‌సైకిల్ కొనిస్తామని ఒప్పుకుని పెళ్లిని జరిపారు. అయితే భర్త మోకాషీ అజిపాల్, అత్తమామలు మోకాషీ లక్ష్మి, లక్ష్మణ్, ఆడపడుచులు అనురాధ, అరుణలు పెళ్లి సమయంలో వరకట్నం ఇవ్వలేదని, మోటార్‌సైకిల్ తేలేదని తరచూ కోడలిని వేధింపులకు గురిచేసేవారన్నారు. పలుమార్లు పంచాయతీ కూడా పెట్టారు. ఈ నేపథ్యంలో శనివారం సాయంత్రం చిట్టిని వేధింపులకు గురిచేశారన్నారు. దీంతో అవమానం భరించలేక ఆమె ఇంట్లో ఎవరూలేని సమయంలో పురుగుల మందు తాగింది. గమనించిన చుట్టుపక్కల వారు, కుటుంబ సభ్యులు వెంటనే అంబులెన్స్‌లో ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం రాత్రి 9 గంటల ప్రాంతంలో మృతి చెందింది. సమాచారం అందుకున్న ఎస్సై పూజ, తహసీల్దార్ తుకారాం రిమ్స్‌కి చేరుకుని పంచనామా నిర్వహించారు. బంధువులు, చుట్టుపక్కల వారిని ఆత్మహత్యకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కాగా, వివాహం అయిన నెలరోజుల నుంచే వరకట్నం కింద ఇస్తామన్నా మోటార్ సైకిల్ కొనివ్వాలంటూ భర్త, అత్తమామలు వేధించేవారని, ఇదే విషయమై తమబిడ్డ ఇంటికొచ్చి గోడు వెళ్లబోసుకునేదని మృతురాలి తల్లిదండ్రులు వాపోయారు. తమ కుమార్తెను భర్త, అత్తా, ఆడపడుచులే కడతేర్చారని ఆరోపించారు.

26న సన్నాహక సమావేశం : ప్రేమ్‌రాజ్

ఆదిలాబాద్ టౌన్, జూలై 20(ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల చేయూత, పెన్షన్‌దారుల గర్జన సభను హైదరాబాద్‌లో ఆగస్టు 13న జరపనున్న నేపథ్యంలో జిల్లా కేంద్రంలో 26న నిర్వహించనున్న సన్నాహక సమావేశానికి ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ హాజరు కానున్నారని దివ్యాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు కల్లేపల్లి ప్రేమ్ రాజ్ తెలిపారు. పట్టణంలోని అంబేద్కర్ భవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇందులో జిల్లా అధ్యక్షుడు ఆరెల్లి మల్లేష్ మాదిగ, రాష్ట్ర గుర్రాల, నాందేవ్, గాగ్రే అనిత, షేక్ షాకీర్, అంజద్ ఖాన్, విలాస్, తదితరులు పాల్గొన్నారు.

టీపీడీఏ నూతన కార్యవర్గం ఎన్నిక

ఆదిలాబాద్ టౌన్, జూలై 20(ఆంధ్రజ్యోతి): తెలంగాణ పవర్ డిప్లమో ఇంజనీర్స్ అసోసియేషన్ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల, కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాల, డివిజన్ కార్యవర్గాలను టీపీడీఈఏ వరంగల్ జిల్లా అధ్యక్షులు ఇంద్రసేన రెడ్డి, ప్రధాన కార్యదర్శి నాగ్రా సుబ్రహ్మణ్యం, ఎన్నికల ప్రధాన అధికారులు గోవర్ధన్ రెడ్డి నరేందర్ సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడిగా గోవర్ధన సతీష్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా గన్ను జనార్ధన్ రెడ్డి, కోశాధికారిగా భూ షణవేణి వెంకటేష్, ఆదిలాబాద్ డివిజన్ కార్యదర్శిగా కొమ్మటి మోహన్ ప్రసాద్, కోశాధికారిగా వినయ్ కుమార్‌లతో పాటు ఆయా డివిజన్‌ల కార్యవర్గాన్ని ఎన్నుకుని వారికి అభినందనలు తెలిపారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తూ.. సత్వర సేవలు అందించేందుకు పాటు పడుతామని వారు పేర్కొన్నారు.

బైక్‌ను ఎత్తుకెళ్లారు.. ఊరి బయట వదిలారు!

బోథ్, జూలై 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని జటాల శ్రీధర్ అనే వ్యక్తికి చెందిన బైక్‌ను శనివారం రాత్రి దొంగలు ఎత్తుకెళ్లారు. అయితే సామాజిక మాధ్యమాల్లో తన బైక్ పోయిన విషయాన్ని పెట్టడంతో పలువురు సదరు వాహనాన్ని గుర్తించారు. దీంతో బైక్‌ను ఎత్తుకెళ్లిన వారు ఊరి బయట ఉన్న మద్యం దుకాణం వద్ద విడిచి వెళ్లారు.



ఉట్నూర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

ప్రభుత్వానికి గొప్పలు.. కార్మికుల తిప్పలు!

(5వ పేజీ తరువాయి...)

మధ్యాహ్న భోజన కార్మికులకు ప్రభుత్వం నెలనెలా సరిపడా బిల్లులు ఇవ్వక పోవడంతో ఎండీఎం కార్మికులు అప్పుల పాలవుతున్నారు. గౌరవ వేతనంపై నియమించిన మధ్యాహ్న భోజన కార్మికులకు ప్రతీనెల గౌరవ వేతనం కింద కేంద్ర ప్రభుత్వం రూ.వెయ్యి చెల్లిస్తే, రాష్ట్ర ప్రభుత్వం రూ.2 వేలు చెల్లిస్తుంది. కానీ ఈ నిధులు సైతం నెలనెలా ఇవ్వడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాలయాపన చేస్తున్నాయి. దీంతో వంటలు వండడానికి రోజుకు విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా కనీసం రూ.వెయ్యిలతో కూరగాయలు, ఆకుకరలు, కోడిగుడ్లు తీసుకువచ్చి విద్యార్థులకు మెనూ ప్రకారం ఎండీఎం కార్మికులు భోజనం అందిస్తున్నారు. అయినప్పటికీ ప్రభుత్వం నుంచి సకాలంలో నిధులు రావడం లేదని ఎండీఎం కార్మికులు విచారం వ్యక్తం చేస్తున్నారు. ప్రాథమిక పాఠశాలలో పని చేస్తున్న ఎండీఎం కార్మికులకు గత ఏడు నెలలుగా, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న ఎండీఎం కార్మికులకు గత రెండు నెలలుగా ప్రభుత్వం బిల్లులు విడుదల చేయక పోవడంతో అప్పుల్లో కూరుకు పోయామని కార్మికులు లబోదిబోమంటున్నారు. కోడిగుడ్ల బిల్లులు మాత్రం గత పది నెలలుగా రావడం లేదని వాపోతున్నారు. ఒక వైపు కోడిగుడ్ల ధరలు పెరిగి పోతుండడంతో కొనుగోలు చేయడం కూడా ఆర్థికంగా ఇబ్బందిగా ఉందని.. అయినా కూడా ప్రభుత్వం నుంచి నిధులు వస్తాయన్న ఆలోచనతో గుడ్లు ఉడికించి పెడుతున్నామని ఎండీఎం కార్మికులు పేర్కొంటున్నారు. రాగి జావా ఉచితంగా సరఫరా చేయడానికి ఒక స్వచ్ఛంధ సంస్థ ముందుకు రావడంతో గత సంవత్సరం కొన్ని నెలలు మాత్రం విద్యార్థినీ విద్యార్థులకు రాగి జావా అందించగలిగారు. ఈ ఏడాది పాఠశాలలు ప్రారంభమై రెండో నెల కావొస్తున్నా ఇంత వరకు స్వచ్ఛంధ సంస్థ ద్వారా రాగి జావా సరఫరా కాక పోవడంతో ఎండీఎం కార్మికులు విద్యార్థులకు రాగి జావా అందించలేకపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఎండీఎం కోసం కావాల్సిన నిధులను సకాలంలో అందించి విద్యార్థులకు మెరుగైన భోజనం అందించేలా ఎండీఎం కార్మికులను ప్రోత్సహించాలని పరిశీలకులు అంటున్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో పిండిగిర్నిలో అగ్నిప్రమాదం

ఉట్నూర్, జూలై 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని దంతనపల్లి ఏనాగుర్తి, గౌరీశంకర్‌కు చెందిన పిండిగిర్నీలో శనివారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో ఆస్తి నష్టం జరిగింది. శనివారం రాత్రి 11.40 గంటల తర్వాత షార్ట్ సర్క్యూట్‌తో జరిగిన అగ్ని ప్రమాదంలో పిండిగిర్నికి చెందిన పైకప్పు, రేకుల షెడ్డు, పూరి గుడిసె తగలబడ్డాయని బాధితుడు బోరుమన్నాడు. కాగా, రూ.రెండు లక్షల వరకు ఆస్తి నష్టం జరిగిందని, ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు. ఆదివారం ఉదయం గ్రామస్థులు సులేమాన్ యాపై, దాసండ్ల ప్రభాకర్, రామకృష్ణ, గుడిపెల్లి భీమన్న, అజ్మీరా సురేష్, తదితరులు పరామర్శించారు.

ప్రమాదంలో యువకుడికి గాయాలు

భీంపూర్, జూలై 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని బల్సర్ రాంపూర్ గ్రామానికి చెందిన మెస్రం రూపేష్ అనే కూరగాయాల వ్యాపారి ఆదివారం ఉదయం ఆదిలాబాద్ నుంచి కూరగాయాలు తీసుకుని మోటార్ సైకిల్‌పై తిరిగి వస్తుండగా ప్రమాదం చోటు చేసుకుంది. తాంసి మండలం గోట్కూరి వద్ద ఒక్కసారిగా అడవి పంది ఎదురుగా వచ్చి మోటార్ సైకిల్‌ను ఢీకొట్టింది. అదుపు తప్పి కింద పడి గాయాలపాలయ్యాడు. అటు వైపుగా వస్తున్న పిప్పల్‌కోటి రూపేష్ కుటుంబీకులకు సమాచారం అందించి ప్రథమ చికిత్స చేయించారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

ముగిసిన బ్యాడ్మింటన్ పోటీలు

నిర్మల్‌రూరల్, జూలై20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండాపూర్‌లో గల నిర్మల్ స్పోర్ట్స్ అకాడమీలో నిర్వహించిన రాష్ట్రస్థాయి జూనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్ పోటీలు ఆదివారం ముగిసినట్లు స్టార్ మంచిర్యాల్ డిస్ట్రిక్ట్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు గాజుల ముఖేష్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి పుల్లూరి సుధాకర్ తెలిపారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ చిన్నమైల్ అంజిరెడ్డి హాజరై మాట్లాడారు. అనంతరం విన్నర్స్, రన్నర్‌లకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వన్నెల భూమన్న, కిషోర్, సందీప్, మధు, నందకుమార్, ప్రణీత్, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం కార్యదర్శి భోజన్న, రామారావు, రాము, అన్నపూర్ణ, తదితరులు పాల్గొన్నారు.

గ్రామ దేవతలకు పూజలు

సారంగాపూర్,జూలై 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని కౌట్ల(బి), స్వర్ణ, బోరిగాం లో గ్రామస్థులు ఆదివారం గ్రామదేవతల కు పూజలు చేశారు. గంగనీళ్లతో గ్రామదేవతలను శుద్ధిచేసి పెరుగన్నాన్ని నైవేద్యంగా సమర్పించారు. అందరూ సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నారు.

తపస్ ఆధ్వర్యంలో గురువందన్ కార్యక్రమం

నిర్మల్ రూరల్, జూలై20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వశిష్ఠ డిగ్రీ కళాశాలలో ఆదివారం తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) జిల్లాశాఖ ఆధ్వర్యంలో గురువందన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏబీఆర్ఎస్ఎం కార్యవర్గ సభ్యులు డా. రవి కుమార్ మాట్లాడుతూ అఖిల భారతీయ రాష్ట్రీయ శైక్షిక్ మహాసంఘ్ న్యూఢిల్లీకి అనుబంధంగా తపస్ జాతీయవాదం, సమాజహితం, దేశ హితం లక్ష్యంగా విద్యార్థులను విలువలు గల పౌరులుగా తీర్చిదిద్దే కార్యక్రమాన్ని చేపడుతుందని అన్నారు. సమాజంలో ఉన్న అన్ని వృత్తుల్లో పవిత్రమైనది ఉపాధ్యాయ వృత్తి అని, గురువులే సమాజ మార్గ నిర్దేశకులని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో తపస్ రాష్ట్ర బాధ్యుడు శశిరాజ్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నవీన్ కుమార్, సుదర్శన్, ఆర్ఎస్ఎస్ జిల్లాసంఘ్ చాలక్ విజయ్ కుమార్, కుంటాల మండల విద్యాధికారి ముత్యం, తదితరులు ఉన్నారు.

మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలి

● కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలి: సీఐటీయూ

ఉట్నూర్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను మల్టీపర్పస్ విధానాన్ని రద్దుచేసి, కనీసవేతనం రూ.26వేలు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అనుమొల కిరణ్ అన్నారు. ఆదివారం ఉట్నూర్ మండల కేంద్రంలోని పొలం సేవా సంఘం భవనంలో నిర్వహించిన సీఐటీయూ గ్రామ పంచాయతీ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జీవో నెంబర్ 51 సవరించాలని అనేక డిమాండ్లను ఈ మహాసభల్లో తీర్మాణం చేయడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల ఖాతాలో 1వ తేదీనే వేతనాలు వేస్తామన్న మాటని అమలు చేయాలని డిమాండ్‌చేశారు. ఈసందర్భంగా ఉట్నూర్ మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఆత్రంసోనేరావు, ప్రధాన కార్యదర్శి ఆత్రంసుందర్, కోశాధికారిగా ఆర్కావెంకట్రావు, ఉపాధ్యక్షులుగా గంగారాం, బాజీరావు, గంగమ్మ, అరవింద్, ఇతరులు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బొజ్జఆశన్న, సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు ఆర్.సురేందర్, తదితరులున్నారు.

మహేశ్వర్‌రెడ్డి శాసనసభ సభ్యత్వాన్ని రద్దుచేయాలి

● సీఎంపై అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ మహేశ్వర్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసిన కాంగ్రెస్ నాయకులు



మహేశ్వర్‌రెడ్డిపై నిర్మల్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



నర్సాపూర్(జి)లో మహేశ్వర్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేస్తున్న దృశ్యం

నిర్మల్‌టౌన్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రజల మనోభావాలను దెబ్బతీసిన బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి శాసనసభ సభ్యత్వాన్ని రద్దుచేయాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. రెండు రోజుల క్రితం నిర్మల్ పట్టణంలో ప్రభుత్వం నిర్వహించిన ఇందిరా మహిళా శక్తి సంబరాల్లో రాష్ట్ర గీతాన్ని ఆలపించే సమయంలో అహంకార ధోరణితో రాష్ట్రగీతానికి కనీసగౌరవం ఇవ్వకుండా అవమానపరిచిన ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి వెంటనే తెలంగాణ ఉద్యమకారులకు, రాష్ట్ర ప్రజలకు క్షమాపణ చెప్పాలంటూ పట్టణ కేంద్రంలో ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. ఆదివారం నిర్మల్ పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్మల్ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నాందేడపు చిన్ను, నాయకులు కలిసి మహేశ్వర్‌రెడ్డి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అలాగే సెర్ప్ డైరెక్టర్ కృష్ణమూర్తిపై చర్య తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సోమ భీమ్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా మైనార్టీ అధ్యక్షుడు జునైద్, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సమ్మద్, ఎన్ఆర్ఐ సెల్ అధ్యక్షుడు హరీష్, రాకేష్, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మణచాంద: మండల కేంద్రంలో ఎమ్మెల్యే, బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి దిష్టిబొమ్మను కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సీఎంపై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు, రాష్ట్రగీతాన్ని అవమానించిందుకు నిరసనగా ఆయన దిష్టిబొమ్మను దహనం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఓడ్నాల రాజేశ్వర్, నాయకులు ప్రతాప్ రెడ్డి, ఆశన్న, నరేష్ రెడ్డి, గంగాధర్, కిరణ్‌ఠాకూర్ ఉన్నారు.


నర్సాపూర్(జి): మండలకేంద్రంలో ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి దిష్టిబొమ్మను ఆదివారం దహనంచేశారు. సీఎంపై అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని మానుకోవాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఇంద్రకరణ్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు రమేష్, రవి, షేక్‌బాబా, సాగర్, బర్ల దయానంద్, నిర్మల్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ అజీమ్, ఆత్మ డైరెక్టర్ శ్యామ్‌రెడ్డి, ఉమామహేశ్వర్, గంగారెడ్డి, గజ్జారాం ఉన్నారు.

దిలావర్‌పూర్: కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు విద్యాసాగర్‌రెడ్డి ఆధ్వర్యంలో జాతీయ రహదారిపై ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనంచేశారు. తెలంగాణ ప్రజలకు ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి బేషరతుగా క్షమాపణలు చెప్పాలని కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు విద్యాసాగర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కట్కం నర్సారెడ్డి, పాల్దే అనిల్, ధని రవి, కాల్వ దేవస్థానం డైరెక్టర్ గైని దేవేందర్, అడెల్లి దేవస్థానం డైరెక్టర్ నర్సారెడ్డి,ఆత్మడైరెక్టర్‌శ్రీహరి, తదితరులున్నారు.


సారంగాపూర్: మండల కేంద్రంలో గల బస్టాండ్ సమీపంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బొల్లోజి నర్సయ్య మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేయడంతోపాటు రాష్ట్ర గీతాన్ని ఆలపించే సమయంలో కనీసం గౌరవం ఇవ్వకుండా వ్యవహరించిన ఎమ్మెల్యేను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎమ్మెల్యేపై ఫిర్యాదు చేశారు. తక్షణమే తెలంగాణ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని అన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ అబ్దుల్ ఆది, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దశరథ్, రాజేశ్వర్, మండల ఉపాధ్యక్షులు విలాస్‌రావు, మాజీ మార్కెట్ కమిటటీ చైర్మన్‌లు రాజు, మహ్మద్, శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు మారుతీ, దాసరి లక్ష్మణ్‌లతో పాటు మార్కెట్ కమిటీ డైరెక్టర్లు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సాముహిక శ్రీదత్త అనఘా వ్రతపూజలు

● దత్త పాదుకలతో శోభాయాత్ర



శోభాయాత్రగా వస్తున్న ఆర్యవైశ్య జిల్లా మహాసభ ప్రతినిధులు



వ్రత పూజలు ఆచరిస్తున్న ఆర్యవైశ్య మహిళా మండలి శ్రేణులు

భైంసా, జూలై 20 (ఆంధ్రజ్యోతి): భైంసాలోని ఎస్ఆర్ గార్డెన్స్‌లో ఆదివారం సాముహిక శ్రీదత్త అనఘా వ్రత పూజలను జిల్లా ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో భైంసా ఆర్యవైశ్య మహాసభ శ్రేణులు వ్రత పూజలను భక్తిశ్రద్ధల మధ్య వేడుకగా నిర్వహించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని బైపాస్ రోడ్డు నుంచి ఎస్ఆర్ గార్డెన్స్ వరకు శ్రీ దత్తాత్రేయ స్వామి పాదుకలకు శోభాయాత్ర చేపట్టారు. బాజాభజంత్రీల మధ్యఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు విలాస్‌గాదేవార్ పాదుకలను వ్రతపూజ స్థలికి తీసుకొచ్చారు. తెలంగాణ రాష్ట్ర అనఘా వ్రత ప్రచారక్ వేణు గోపాల శర్మ చేతుల మీదుగా సాముహిక శ్రీదత్తఅనఘా వ్రతపూజలు జరిగాయి. ఇందులో భాగంగా గణపతి, పూర్వాంగ పూజలు షోడశోపచారాలతో నిర్వహించారు. పట్టణ పరిధిలోని ఆర్యవైశ్య మండలి సభ్యులు కార్యక్రమంలో అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మహిళలు అనఘా వ్రత పూజలను నియమనిష్ఠలతో చేపట్టారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర అనఘా వ్రత ప్రచారక్ వేణు గోపాల శర్మ శ్రీ దత్త అనఘా వ్రత విశిష్టతను, ప్రాశస్త్యాన్ని వివరించారు. ఈ వ్రతాన్ని కృత,త్రేతా,ద్వాపర యుగాలలో కార్తవీర్యార్జునుడు, శ్రీరామ చంద్రుడు, శ్రీ కృష్ణ భగవానుడు ఆచరించినట్లుగా తెలిపారు. ఎంతో విశేషమైన శ్రీ దత్త అనఘా వ్రత చేయడం ద్వారా దత్తాత్రేయుని అనుగ్రహం, అష్టసిద్ధులు, జ్ఞానం, ఐశ్వర్యం, ముక్తి లభిస్తాయని వివరిచారు. ఇందులో ఆర్యవైశ్య మహాసభ జిల్లా ప్రతినిధులు ధర్బార్ శ్రీశైలం, గుజ్జల్‌వార్ సాయినాథ్‌లతో పాటు భైంసా ఆర్యవైశ్య మండలి శ్రేణులు పాల్గొన్నాయి.

అడెల్లి పోచమ్మకు నర్సింగ్ ఏసీపీ పూజలు



ఏసీపీని శాలువాతో సన్మానిస్తున్న దృశ్యం

సారంగాపూర్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అడెల్లి ఆలయంలో ఆదివారం హైదరాబాద్ గండిపేట నర్సింగ్ ఏరియా ఏసీపీ రమణాగౌడ్ కుటుంబ సభ్యులతో కలిసి మొక్కులు మొక్కి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పూజారి అమ్మవారికి హారతినిచ్చి తీర్థప్రసాదాలను అందించారు. దీంతో ఆలయ చైర్మన్ భోజాగౌడ్ ఆయనను శాలువతో సన్మానించారు. ఆయనవెంట మాజీ జెడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, నాయకులు దశరథ్, రాజేశ్వర్‌ల తదితరులున్నారు.

చలో గన్‌పార్క్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి

● టీయూఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సామ కిరణ్ రెడ్డి

నిర్మల్ రూరల్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): 22న నిర్వహించనున్న చలో గన్‌పార్క్ నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీయూఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సామ కిరణ్‌రెడ్డి కోరారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రసాధనలో కీలక పాత్రపోషించిన ఉద్యమకారులు తమ హక్కుల కోసం మరోసారి పోరాటానికి సిద్ధమవుతున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చినహామీలను నిలబెట్టుకోవడంలో విఫలమైందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాకముందు ఉద్యమ నాయకులను కలిసి తాము అధికారంలోకి వస్తే అన్ని రకాలుగా ఆదుకుంటామని మేనిఫెస్టోలో పొందుపరిచిందని, ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆ హామీలను విస్మరించిందని ఉద్యమకారులు ఆవేదన వ్యక్తం చేశారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య



శ్రీను (ఫైల్)

సోన్, జూలై20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని న్యూ వెల్మల్ శివారులో తమ్మిశెట్టి శ్రీను పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. లక్ష్మణచాంద మండలం రాచాపూర్‌కు చెందిన శ్రీను మేస్త్రి పని చేస్తున్నాడు. కొద్దినెలల నుంచి తాను పట్టుకున్న కొత్త ఇళ్లు కంప్లీట్ చేయలేక, కూలీలు దొరకక ఆర్థికంగా ఇబ్బందులు పడ్డాడు. మానసికంగా బాధపడి జీవితంపై విరక్తి చెంది శనివారం నూవెల్మల్ గ్రామ శివారులో పురుగుల మందు తాగాడు. అతడిని నిర్మల్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తర లించి, అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఆదివారం ఉదయం 9:30 గంటలకు మృతిచెందాడు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుడి భార్య తమ్మిశెట్టి శిరీష ఇచ్చిన ఫిర్యాదు మేరకు సోన్ ఎస్సై కే.గోపి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు



గాయపడ్డ కొండురావ్ పాటిల్

భైంసా, జూలై20 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని జాతీయ రహదారి మార్గంలో గల పిప్రి కాలనీ వద్ద ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్ర గాయాల పాలయ్యాడు. భైంసా మండలంలోని బాబల్‌గావ్ గ్రామానికి చెందిన కొండురావ్ పాటిల్ (48) పల్సర్ బైక్‌పై మాటేగావ్ వైపు నుంచి మున్సిపల్ కేంద్రమైన భైంసాకు వస్తుండగా ఘటన చోటుచేసుకుంది. జాతీయ రహదారి మార్గంలోని డివైడర్ మధ్య భాగం నుంచి వ్యక్తి ఒకరు ఆకస్మాత్తుగా రోడ్డు పైకి వచ్చాడు. ఇదే సమయంలో పల్సర్ బైక్ ద్వారా కొండురావ్ పాటిల్ అక్కడి మార్గం మీదుగా వెళ్తూ ఆకస్మాత్తుగా వచ్చిన వ్యక్తిని తప్పించబోయి ప్రమాదవశాత్తు అదుపుతప్పి కింద పడి తీవ్రగాయాల పాలయ్యాడు. స్థానికులు క్షతగాత్రుడిని వైద్యసేవల నిమిత్తం ప్రైవేట్ వాహనం ద్వారా భైంసాలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.



నిర్మల్-స్వర్ణ రహదారిపై ప్రమాదంగా ఉన్న మూలమలుపు

పొంచి ఉన్న ప్రమాదం

- మలుపుల వద్ద సూచిక బోర్డులు కరువు
- పట్టించుకోని ఆర్‌అండ్‌బీ అధికారులు

సారంగాపూర్, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ పట్టణం నుంచి స్వర్ణ రహదారిపై పలుచోట్ల ఉన్నటువంటి మూలమలుపుల వద్ద సూచిక బోర్డులు లేక పోవడంతో ప్రయాణికులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నామని పేర్కొంటున్నారు. గత కొన్ని సంవత్సరాల క్రితం మూలమలుపుల వద్ద అక్కడక్కడా ఏర్పాటు చేసి సూచిక బోర్డులు ధ్వంసం కావడంతో ఎలాంటి సూచిక బోర్డులు లేక పోవడంతో వావాహనదారులకు ప్రమాదాలు తప్పడం లేదని పేర్కొంటున్నారు. దీంతో పాటు ఇతర ప్రాంతాలకు వాహనాలపై వెళ్లాలంటే వాహనచోదకులు అరచేతిలో ప్రాణాలను పెట్టుకొని ఇతర రాకపోకలను సాగిస్తున్నామని ప్రతి రోజు ఇతర పనులు కోసం అధిక సంఖ్యలో వాహనదారులు రాకపోకలు సాగిస్తుండడంతో పాటు ప్రతి ఆదివారం అడెల్లి మహా పోచమ్మ ఆలయానికి మొక్కులు తీరుచుకోవడానికి అధిక సంఖ్యలో భక్తులు ప్రయివేటు వాహనాలతో పాటు మోటర్ సైకిల్ పై మొక్కులు తీర్చుకోవడానికి వస్తుపోతుంటారు. ఈ క్రమంలో మండల కేంద్రంలో గల సబ్‌స్టేషన్ కౌట్ల (బి)లో గల శాంతినగర్, సాయినగర్ తండా వద్ద రహదారిపై ఉన్నటువంటి మూల మలుపుల వద్ద అర్‌అండ్‌బి అధికారులు ఇలాంటి సూచిబోర్డులను ఏర్పాటు చెయ్యక పోవడంతో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయని వాహనదారులు పేర్కొంటున్నారు. రహదారిపై అక్కడక్కడ గతంలో నిర్మించిన వంతెనలకు మరమ్మత్తులు చేపట్టక పోవడంతో ఈ రహదారి గుండా వెళ్లాలంటే జంకుతున్నామని ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ఉండాలంటే ఇప్పటికయినా సంబంధిత అధికారులు వంతెనలకు మరమ్మత్తులు చేసి మూల మలుపుల వద్ద సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని వాహనదారులు పేర్కొంటున్నారు.



ప్రమాదంగా మారిన వంతెన



అఖిల గాండ్ల తెలికుల సంఘం ఆధ్వర్యంలో భారీ శోభాయాత్ర



సంజయ్ నగర్‌లో బోనాల వేడుకలు పాల్గొన్న ఎమ్మెల్యే పాయల్ శంకర్



మహంకాళి, పోతరాజుల వేషధారణలో విన్యాసం

సంస్కృతికి ప్రతిబింబం.. బోనాలు

- ఆదిలాబాద్ జిల్లాలో వైభవంగా సాగిన బోనాల పండుగ
- అమ్మవారికి సామూహిక నైవేద్యం అందజేసిన మహిళలు
- ఆకట్టుకున్న పోతరాజుల విన్యాసాలు

ఆదిలాబాద్ టౌన్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ఆషాడ మాసంలో అత్యంత వైభవంగా జరుపుకునే బోనాల పండగ వేడుకలతో కోలాహల వాతావరణం నెలకొంది. ఆదివారం అమ్మవారికి బోనాలు సమర్పించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. వేకువ జాము నుంచే అమ్మవారికి నైవేద్యం సమర్పించేందుకు కుటుంబ సమేతంగా బయలుదేరారు. పట్టణంలోని అశోక్ రోడ్డులో గల పోచ్చమ్మ తల్లి ఆలయంతో పాటు మహాలక్ష్మి వాడ లోని అమ్మవారి ఆలయంలో బోనాల సందడి నెలకొంది. తమ పిల్ల పాపలు సుఖ సంతోషాలతో జీవించాలని అమ్మవారిని వేడుకుంటూ ప్రత్యేక పూజలు చేసి బోనాలను సమర్పించుకున్నారు. వాడవాడలా డప్పు చప్పుళ్ల నడుమ బోనాల కుండలతో మహిళలు పోచమ్మ ఆలయాలకు తరలివచ్చారు. పోతరాజుల విన్యాసాలు... బోనాల సమర్పణ కోలాహలంతో ఆలయాల్లో పండగ వాతావరణం నెలకొంది. భక్తుల తాకిడిని దృష్టిలో ఉంచుకుని పోలిసు యంత్రాంగం ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టింది. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ఆయా ఆలయాల వద్ద పటిష్ట చర్యలు తీసుకున్నారు. అఖిల గాండ్ల తేలికుల సంఘం ఆధ్వర్యంలో భారీ శోభాయాత్ర అఖిల గాండ్ల తేలికుల సంఘం ఆధ్వర్యంలో సామూహిక బోనాల శోభాయాత్రను ఉత్సాహంగా నిర్వహించారు. స్థానిక మార్వాడి ధర్మశాల శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం నుంచి శోభాయాత్ర చేపట్టగా.. ఎమ్మెల్యే పాయల్ శంకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మహంకాళి అమ్మవారు, పోతరాజులు, పెద్దపులి వేషధారణలో చేపట్టిన విన్యాసాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. మార్వాడి ధర్మశాల నుంచి పట్టణ పురవీధుల గుండా అశోక్ రోడ్ లోని పెద్ద పోచమ్మ తల్లి ఆలయం వరకు శోభాయాత్ర ఉత్సాహంగా సాగింది. అనంతరం మహిళలు అమ్మవారికి బోనాలను అందజేసి, మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడుతూ... తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు బోనాల పండగ నిలువెత్తు నిదర్శనం నిలుస్తుందని అన్నారు. అమ్మవారి దయతో పాడి పంటలు సమృద్ధిగా పండి, ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అఖిల గాండ్ల తేలికుల సంఘం నాయకులు, కులస్తులు, మహిళ లు, యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. బోనం కుండను తలపై పెట్టుకుని శోభాయాత్రలో పాలు పంచుకున్నారు. చిన్నారుల పోతరాజుల విన్యాసాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

టీచర్స్ కాలనీలో..

స్థానిక టీచర్స్ కాలనీ లోనూ బోనాల పండగ వేడుకలు ఉత్సాహంగా సాగాయి. కాలనీకి చెందిన మున్నూరుకాపు సంఘం మహిళలు పెద్ద సంఖ్యలో అమ్మవారి ఆలయానికి వచ్చి బోనాలు సమర్పించారు. పురుషులు సైతం పగిడిలు ధరించి ఉత్సాహంగా శోభయత్రలో పాల్గొనడంతో సందడి వాతావరణం నెలకొంది.

బోనమెత్తిన బరంపూర్

తలమడుగు: మండలంలోని బరంపూర్ గ్రామంలో ఆదివారం ఘనంగా బోనాల పండుగను గ్రామస్థులందరూ సామూహిక బోనాలను మహాలక్ష్మి అమ్మవారికి మేళవాయిద్యాల నడుమ పోతరాజు విన్యాసాలతో గ్రామ పుర వీధుల గుండా నాట్యాలు చేస్తూ బోనాలను సమర్పించారు. అమ్మవారికి పట్టు వస్త్రాలు, ప్రత్యేక బోనంను గ్రామ పెద్దకాపు రెడ్డి దంపతులుమెరుగు మోహన్ రెడ్డి దంపతులు సమర్పించారు. ఈ సందర్భంగా బరంపూర్ గ్రామస్థులు మాట్లాడుతూ నూతన మహాలక్ష్మి అమ్మవారి ఆలయం నిర్మిం చుకొని ఆషాడ మాస బోనాలను అమ్మవారికి సమర్పించడం జరిగిందని, అమ్మవారి కృపాకటాక్షాలతో గ్రామం పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని వేడుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వీడీసీ అధ్యక్షుడు గడుగు శ్రీనివాస్,గ్రామ పెద్దలు కేదారేశ్వర మాజీ జడ్పీటీసీ బాపన్న రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, బరకం మల్లేష్ ,బాపూరావు, నరేష్ రెడ్డి, ప్రతాప్, శ్రీనివాస్, రాజేందర్ రంజిత్ రెడ్డి రమాకాంత్ నారాయణరెడ్డి నవీన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



బరంపూర్‌లో బోనాల సందర్భంగా ఆకట్టుకున్న పోతరాజుల విన్యాసాలు

కండేడి వాగులో ఇసుక దొంగలు

- రాత్రికి రాత్రి మాయమవుతున్న ఇసుక

బోథ్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం సమీపంలోని కండేడి వాగులో నల్ల ఇసుక రాత్రికి రాత్రి తరలిపోతున్నది. వాగుల్లో నుంచి ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలించకు వెళ్తున్నారు.. వర్షాలు త్రియకపోవడంతో.. ఈ ఏడాది ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో కొన్ని వాగుల్లో నీరు ఇంకా రాలేదు దీంతో కొంతమంది డాక్టర్ల యజమానులు వాగుల్లో రాత్రిపూట వెళ్లి దొంగతనం తరలించుకు వెళ్తున్నారు. పటిష్టమైన బందోబస్తు మధ్యన ఇసుక తవ్వకాలు కొనసాగుతున్నాయి కొంతమంది ట్రాక్టర్ల యజమానులు వాగులకు అర కిలోమీటర్ దూరంలో కాపలా కాస్తూ తీసుకొని వెళ్తున్నారు రాత్రిపూట ఎవరైనా అడ్డుకుంటే వారిపై దాడులకు సైతం వెనుకాడరని అంటున్నారు. మద్యం సేవించి కాపలాగా ఉండేవారిని ఎవరు కూడా అడ్డుకునేందుకు సాహసించరని పలువురు పేర్కొంటున్నారు అయితే వాగుల్లో ఇదే విధంగా ఇసుక తరలిపోతే భవిష్యత్తులో నీటి నిల్వలు ఉండవని పేరు కొంటున్నారు. వద్దంటున్నా వినడం లేదు. తమ పంట పొలాల సమీపంలో ఉన్న కండేడి వాగు నుంచి ఇసుకను తరలించవద్దని చెబుతున్న వినకుండా కొంత మంది స్థానిక ట్రాక్టర్ల యజమానులు రాత్రికి రాత్రి తీసుకొని తరలించబోతున్నారని పొలం యజమాని ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు ఈ విషయంలో రెవెన్యూ అటవీశాఖ అధికారులు చొరవ చూపించాలని కోరారు... ఇసుక తరలింపుకు అనుమతులు లేవు తాసిల్దార్.. మండలంలోని వాగుల నుంచి ఇసుక తరలింపుకు ఎలాంటి అనుమతులు లేవని తాసిల్దార్ సుభాష్ చంద్ర పేర్కొన్నారు



వాగులో ఇసుక తోడుకోవడంతో గుంతలు పడ్డ వాగు

పట్టపగలే వెలుగుతున్న వీధి దీపాలు

ఇచ్చోడ, జులై, 20 (ఆంధ్రజ్యోతి) : ఇచ్చోడ మండల పరిధిలోని టీచర్స్ కాలనీలో పలు వీధి దీపాలు నెలలుగా నిరంతరాయంగా వెలుగుతున్నాయి. నిర్వహణ లేకపోవడంతో అందులోని కొన్ని లైట్లు వెలగడంలేదు. దీపాలు వెలగని ప్రాంతంలో దీపాలు ఏర్పాటుచేసి, నిరంతరం వెలిగె దీపాలకు నిర్వహణ చేపట్టి విద్యుత్తు వృథాను అరికట్టాలి. ఈ విషయమై అధికారుల కార్యాలయాలకు వెళ్లి పలుమార్లు విజ్ఞప్తి చేసినా ఈ రోజు రేపు అంటూ కాలయాపన చేస్తున్నారే తప్ప ఇటువైపు కన్నెత్తి చూడడంలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యలను అధికారులకు చెప్పేందుకు ఫోన్లు చేసినా ఫోన్లు ఎత్తడంలేదని చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని ప్రజలు కొరుతున్నారు.



పగలు, రాత్రి లేకుండా వెలుగుతున్న వీధి దీపాలు

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి వాగు కష్టాలు

- తిప్పలు ఎదుర్కొంటున్న లబ్ధిదారులు



బురదలో కూరుకు పోయిన ట్రాక్టర్

బజార్‌హత్నూర్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపల్లి గ్రామానికి వెళ్లే బురద దారి, వాగు కష్టాలతో ప్రతినిత్యం గ్రామస్థులు అవస్థలు పడుతున్నారు. వర్షాకాలం నాలుగు నెలలు వారి బాధలు మాటల్లో చెప్పరానివి, మెరుగైన ఆరోగ్య చికిత్స అందించాలన్న నిండు గర్భిణీ మహిళకు ఆసుపత్రికి తీసుకెళ్లాలన్న, చివరికి ప్రభుత్వం అందిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ మోసుకోవాలన్న బంద్రేవ్‌వాగుతో పాటు బురద రోడ్డు అవస్థలను ఎదుర్కొక తప్పడం లేదు. గ్రామానికి మొదటి విడతగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయి. కాగా వాటికి సంబంధించిన సామాగ్రి ట్రాక్టర్‌తో అతికష్టంగా తీసుకెళ్లే క్రమంలో ఆదివారం వాగుదాటించి రోడ్డు బురదలో ఇరుక్క పోయింది. వాహనంలో ఇసుక, ఇటుకలు, రాడ్లు, సిమెంట్ బరువుతో మట్టిలో కూరుక పోయింది. మరో ట్రాక్టర్‌తో నెట్టినా కూడా కదల్లేదు. చేసేది లేక కొంత మంది గ్రామస్థుల సహాయంతో సామాగ్రిని కిందికి దింపి మరో ట్రాక్టర్, ఎడ్లబండ పై తీసుకొని వెళ్లామని లబ్ధిదారులు ఆవేదన చెందారు. కాలం మారినా, అధికారులు మారినా, ప్రజా ప్రతినిధులు మారుతున్నా తమ కష్టాలు మారడం లేదంటూ గ్రామస్థులు తాము పడుతున్న అవస్థలను చెప్పుకొచ్చారు.

భజనల్లో రాణిస్తున్న తాంసి మండల కళాకారులు



భజనలో పాల్గొన్న తాంసి మండల కళాకారులు

- తబలా వాయించడం .. పాటలు పాడటంలో రాణిస్తున్న కళాకారులు

తాంసి, జూలై 20 (ఆంధ్రజ్యోతి): కంప్యూటర్ యుగంలోనూ భజనకు ఎంతో క్రేజీ ఉందని చెప్పవచ్చు. ఒకసారి భజనలో పాల్గొంటే మళ్ళీ మళ్ళీ పాల్గొనాలనే తపన కలగడంలో ఎలాంటి సందేహం లేదు. దీనికి కారణం తాంసి మండలంలో ఉన్న భజన కళాకారులే అని చెప్పక తప్పదు. ఎక్కడ భజన పోటీలు జరిగినా, ఏ ఆలయంలో భజన చేయాలన్న తాంసి మండల కళాకారులకు సాటిలేరనే చెప్పవచ్చు. ప్రతీ శనివారం తాంసి మండలంలోని కప్పర్ల, వడ్డాది, బండల నాగపూర్, తలమడుగు మండలంలోని బరంపూర్ వెంకటేశ్వర స్వామి ఆలయంలో చేపట్టే భజనల్లో మండల కళాకారులు పాల్గొంటున్నారు. వారు పాడే పాటలు ఎంతో ఆకట్టుకుంటున్నాయి. పొన్నారి గ్రామానికి చెందిన గడుగు గంగన్న తబలా వాయిస్తే అందరి దృష్టి ఆయన పైనే ఉంటుంది. రాష్ట్రస్థాయిలో కూడా ఈయన భజన అందరికీ ఆదర్శంగా నిలిచింది. తబలా వాయించడమే కాదు హార్మోనియం వాయిస్తూ పాటలు పాడుతూ ఉంటే మధురమైన గానమృతం వినిపిస్తుంది. హస్నాపూర్ గ్రామా నికి చెందిన లింగారెడ్డి పాటలు పాడితే ఆయనకు సాటి ఎవరు రారు అ నడంలో సందేహం లేదు. తాంసి గ్రామానికి చెందిన భాస్కర్ వాయించే హా ర్మోనియం చాలా బాగుంటుంది. ఈపాటికే రాష్ట్రం నలుమూలలో నిర్వహించే పోటీల్లో పాల్గొని ప్రథమ బహుమతులను గెలుచుకున్నారు. ఎక్కడ ఏ శుభ, అశుభ కార్యక్రమం జరిగిన మండల కళాకారులు పాల్గొనేలా చూస్తారు. కళాకారులకు ప్రస్తుతం నూతన పద్ధతుల్లో వస్తున్న పరికరాలను అందిస్తే మరింత రాణించే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు.

- ఏ పాట పాడినా తబలా వాయిస్తా..



- గడుగు గంగన్న, పొన్నారి

ఎవరు ఎలాంటి పాటలు పాడిన తాను తబలా వాయిస్తా. తబలా వాయించడం కాదు పాటలు కూడా పాడుతూ ఉంటాను. హార్మోనియం కూడా వాయిస్తూ పాట పాడుతాను. తాంసి మండలం నుంచి పలుమార్లు ఇతర ప్రాంతాల్లో పోటీల్లో పాల్గొని బహుమతులు కూడా తెచ్చుకున్నాం. ప్రభుత్వం సహకరిస్తే భజన రంగంలో ఎక్కడైనా తామే మొదటిలో ఉండేలా చర్యలు తీసుకుం టాం. తమకు కావాల్సిన పరికరాలను అందించాలని కోరుతున్నాం.

ఆధార్ లేదు.. బడిలో అడ్మిషన్ లేదు

- విద్యకు దూరం అవుతున్న కొలాం పిల్లలు
- పట్టించుకోని ప్రభుత్వ అధికారులు



ఆధార్ కార్డు లేక విద్యకు దూరంగా ఉన్న కొలాం పిల్లలు

నార్నూర్, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న 12 అంకెల ఆధార్ కార్డ్ మన గుర్తింపునకు చిహ్నంగా ఉంది. కని ఇదే ఆధార్ కార్డు ఏజన్సీ గిరిజన తాడిహత్నూరు గ్రామ పంచాయితీ కోలంగుడా గ్రామం కొలాం పిల్లలు వద్ద లేనందున్న చిన్నారులకు బడిలో అడ్మిషన్ లేక విద్యకు దూరమవుతున్నారు. దాదాపుగా పది మంది చిన్నారులు ఇంటి దగ్గరనే ఆటలు ఆడుతు ఉన్నారు. ఇలాంటి క్లిష్టమైన పరిస్థితి ఆదివాసులు జీవిన విధానం ఉన్న ఇక్కడ ప్రభుత్వ అధికారులు మాత్రం వారి గురించి పట్టించుకోవడం లేదు అంటూ గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ప్రత్యేక ఏజెన్సీ గిరిజన ప్రాంత పేరుకి ఉంది. దగ్గర 20 కిలోమీటర్‌కు ఆదివాసుల అభివృద్ధికి ఐటీడీఏ ప్రత్యేక అధికారి ఉన్న డిజిటల్ యుగంలో చీకటి మా బతుకులు అంటూ కొలాం ప్రజలు బాధ పడుతున్నారు. ఇక విద్యనే తమకు దొరక కుంటే మా అభివృద్ధి ఎలా జరగుతుంది ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి విద్యార్థులకు ఆధార్ కార్డు జారీ చేసేలా కృషి చేయాలని ప్రాంత వాసులు కోరుతున్నారు.

ఖాళీ స్థలాలు.. మురికి కూపాలు!

- వ్యాపిస్తున్న దుర్గంధం
- విజృంభిస్తున్న దోమలు
- రోగాల బారిన ప్రజలు
- చోద్యం చూస్తున్న అధికారులు

దిలావర్‌పూర్, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : అసలే వర్షాకాలం... వ్యాధుల వ్యాప్తికి అనువైన కాలం... వీటికి తోడు పారిశుధ్య లోపం... ఇవన్నీ కలిసి ప్రజలకు శాపంగా పరిణమిస్తున్నాయి. చర్యలు తీసుకోవాల్సిన అధికారులు చోద్యం చూస్తున్నారు. దిలావర్‌పూర్ మండల కేంద్రంలో జనావాసాల మధ్య ప్రైవేట్ వ్యక్తులకు సంబంధించిన ఖాళీ స్థలాలు (ప్లాట్లు) ఉన్నాయి. సదరు వ్యక్తులు వాటిని అలాగే వదిలేయడంతో చుట్టుపక్కల ఉండే ప్రజలకు ఇబ్బందిగా మారుతున్నాయి.

వ్యాపిస్తున్న దుర్గంధం..

మండల కేంద్రంలోని ఒకటో వార్డులో ఉన్న ఖాళీ స్థలం ఆ కాలనీ వాసులకు తీవ్ర అసౌకర్యానికి గురిచేస్తోంది. ఆ ఖాళీ స్థలం చుట్టూ గృహాలు కట్టుకోవడంతో ఆ ఖాళీ స్థలం లోతుగా మారింది. దీంతో మూడు కాలాలు మురుగు నీరు ఆ ఖాళీ స్థలంలోకి వస్తోంది. దీంతో ఆ ఖాళీ స్థలం కాస్త పెద్ద మురుగు నీటి గుంతలా మారి కాలనీలో దుర్గంధం వెదజల్లుతోంది. చుట్టుపక్కల వారితో పాటు సమీపంలోనే భవనంలో హాస్టల్ విద్యార్థులుంటున్నారు. మురుగు గుంత నుంచి వచ్చే దుర్గంధం భరించలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే పోచమ్మ దేవాలయం వెళ్లే రోడ్డు పక్కన ఉన్న స్థలం సైతం మురుగు నీరు చెరువులా ఉంది. గ్రామంలోని మురుగు నీరంతా ఇక్కడికి వచ్చి చేరుతోంది. దీంతో ఆ చుట్టుపక్కల ఉన్న కుటుంబాల వారు అవస్థలు పడుతున్నారు. ఆ రోడ్డు గుండా వెళ్లేవారు ముక్కు మూసుకోందే వెళ్లలేని పరిస్థితి ఉంది. ఈ మురుగు నీటి గుంతకు సమీపంలోనే కేజీబీవీ పాఠశాలతో పాటు ఉర్దూ మీడియం పాఠశాలలున్నాయి. కాలనీ వాసులతో పాటు విద్యార్థులు అసౌకర్యానికి గురవుతున్నారు.



దిలావర్‌పూర్ ఒకటో వార్డులో జనావాసాల మధ్య మురుగు నీరు

విజృంభిస్తున్న దోమలు..

ఖాళీ స్థలాలు కాస్త మురుగు నీటి గుంతలు కావడంతో దోమలకు ఆవాసాలుగా మారాయి. రోజురోజుకు దోమలు విజృంభిస్తూ గ్రామస్థులను నిద్రలేని రాత్రులు గడిపేలా చేస్తున్నాయి. గ్రామస్థులు దోమలతో వేగలేక పోతున్నారు. రాత్రి వేళల్లో దోమలు తమ ప్రతాపం చూపిస్తూ ప్రజలను ఆసుపత్రుల పాలు చేస్తున్నాయి. దోమల వల్ల చాపకింద నీరులా జ్వరాలు వస్తున్నాయి. కొంత మంది చలితో కూడిన జ్వరాలతో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్సలు తీసుకుంటున్నారు. దోమకాటు వల్ల ప్రమాదకరమైన డెంగీ జ్వరం వచ్చే ప్రమాదం పొంది ఉండటంతో గ్రామస్థులు భయాందోళనను వ్యక్తం చేస్తున్నారు.

చోద్యం చూస్తున్న అధికారులు..

ఎప్పటికప్పుడు తగిన చర్యలు తీసుకుంటూ ప్రజలకు అసౌకర్యం కలుగకుండా చర్యలు చేపట్టాల్సిన అధికారులు చోద్యం చూస్తున్నారు. చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్లు అన్న చందంగా ప్రజలు వ్యాధుల బారిన పడిన తర్వాత మేమున్నామంటూ వచ్చి హడావిడి చేసే బదులు ముందే చర్యలు తీసుకుంటే ఇబ్బందులుండవు కదా అని ఆయా కాలనీల వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆ ఖాళీ స్థలాలు పలుకుబడి కలిగిన వ్యక్తులవి కాబట్టే అధికారులు వదిలేస్తున్నారని, అదే సామాన్య వ్యక్తులవైతే కఠిన చర్యలు చేపట్టేవారని ఆరోపిస్తున్నారు. అధికారులు మురుగు నీటి గుంతలు లేకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



కేజీబీవీ, ఉర్దూ మీడియం పాఠశాలల సమీపంలో ఉన్న మురికి కూపం

ఖాళీ స్థలాల యజమానులకు నోటీసులు ఇచ్చాం..

- చంద్రశేఖర్, ఈవో, గ్రామ పంచాయతీ, దిలావర్‌పూర్

ప్రైవేట్ ఖాళీ స్థలాల యజమానులకు ఇంతకు ముందే నోటీసులు ఇచ్చాం. వారి స్పందన కోసం ఎదురుచూస్తున్నాం. వారు స్పందించకపోతే గ్రామ పంచాయతీకి ఉన్న విస్తృత అధికారాన్ని ఉపయోగించి, చర్యలు చేపడతాం. ప్రస్తుతానికి దోమలు వ్యాప్తి చెందకుండా ఆయిల్ బాల్స్, ఎంఎల్‌వో ఆయిల్ చల్లుతాం. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాము.





గోదావరి జలాలను తీసుకెళ్తున్న రైతులు

వానమ్మా.. కరుణించు!

- మైలాపూర్ గ్రామ రైతుల ప్రత్యేక పూజలు

బాసర, జూలై20 (ఆంధ్రజ్యోతి): వర్షాలు కురవాలని బాసర పంచాయతీ పరిధిలో గల మైలాపూర్ గ్రామ రైతులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోదావరి జలాలను తీసుకొని వచ్చి గ్రామంలో ఉన్న దేవతామూర్తులకు అభిషేకించి పూజలు నిర్వహించారు. వానాకాలం ప్రారంభమై నెల గడిచిపోయినా పెద్ద వర్షాలు కురియలేదని, సోయా, వరి, పత్తి వంటి పంటలను మొలక దశలోనే ఎండిపోతున్నాయని పూజలు చేశారు.

నిర్మల్ నుంచి పండరిపూర్‌కు సూపర్ లగ్జరీ: డీఎం

నిర్మల్‌రూరల్, జూలై20(ఆంధ్రజ్యోతి): నిర్మల్ నుంచి పండరిపూర్‌కు, తుల్జాపూర్ తుల్జాభవాని, విఠలేశ్వర్ మందిర్, రుక్మాబాయి టెంపుల్‌లకు సూపర్ లగ్జరీ బస్సు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ కే. పండరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 27వ తేదీ ఆదివారం మధ్యాహ్నం 2గంటలకు బయలుదేరి సోమవారం ఉదయం పండరిపూర్, తుల్జాపూర్ దర్శించుకొని సాయంత్రం 6 గంటలకు బయలుదేరి మంగళవారం ఉదయం 5 గంటలకు నిర్మల్ చేరుకోనుందని తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

నిర్మల్‌రూరల్, జూలై20(ఆంధ్రజ్యోతి): ఉపాధి కల్పన నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు, గరిమా గ్రే షెల్టర్ హోమ్స్ స్థాపన, నిర్వహణ కోసం ట్రాన్స్‌జెండర్ల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి, అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇతర పూర్తివివరాలకు సంక్షేమ అధికారి, మహిళా శిశు దివ్యాంగుల వయోవృద్ధుల, ట్రాన్స్‌జెండర్స్ సంక్షేమశాఖ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.



హాజరు కోసం హైటెక్ సిస్టం

- డాక్టర్లు, టీచర్ల గైర్హాజరుకు ముకుతాడు
- పకడ్బందీగా అటెండెన్స్ ట్రాకింగ్
- ఇప్పటికే వైద్యసిబ్బందికి బయోమెట్రిక్, టీచర్ల్‌కు లైవ్ లొకేషన్ అమలు
- ఇక ఫేషియల్ రికాగ్నైజేషన్ హాజరు

నిర్మల్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేసే డాక్టర్లు, సిబ్బంది అలాగే విద్యాశాఖలో పనిచేసే టీచర్ల హాజరు కోసం హైటెక్ టెక్నాలజీని వినియోగించబోతున్నారు. ప్రస్తుతం ఈ రెండుశాఖల్లో అమలవుతున్న హాజరు విధానం కఠినంగానే ఉన్నా ఉద్యోగులు, టీచర్ల విధుల ఎగవేతలు మాత్రం తప్పడం లేదన్న ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. కాగా తెలంగాణ వైద్యవిధాన పరిషత్ పరిధిలోని హాస్పిటల్స్‌లలో గత కొంతకాలం నుంచి బయోమెట్రిక్ అటెండెన్స్‌ను అమలు చేస్తున్నారు. అయితే ఈ బయోమెట్రిక్ అటెండెన్స్‌పై సరైన మానిటరింగ్ లేని కారణంగా కొన్నిచోట్ల కొంతమంది డాక్టర్లు, సిబ్బంది ఇష్టారాజ్యంగా విధులు నిర్వహిస్తున్నట్లు ఫిర్యాదులున్నాయి. ఎలాంటి అనుమతి తీసుకోకుండా సెలవులు పెట్టడం, డ్యూటీల సమయం ముగియకముందే మధ్యలోనే వెళ్లిపోవడం అలాగే ఆలస్యంగా బయోమెట్రిక్ అటెండెన్స్ నమోదు చేస్తుండడం పరిపాటిగా మారిందంటున్నారు. దీనికారణంగా చాలా హాస్పిటళ్లలో రోగులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నట్లు విమర్శలున్నాయి.

వైద్యశాఖలో హాజరు ట్రాకింగ్ అమలు

డాక్టర్లు, సిబ్బంది బయోమెట్రిక్ అటెండెన్స్ పైనే కాకుండా విధుల ఎగవేత, డ్యూటీ సమయాల్లో డుమ్మాలు లాంటి వాటిపై ఇక సంబంధిత శాఖ ప్రత్యేక ఫోకస్ పెడుతోంది. ఇందులో భాగంగానే వైద్యవిధాన పరిషత్ రాష్ట్రస్థాయిలో డాక్టర్లు, సిబ్బంది అటెండెన్స్‌ను ట్రాకింగ్ చేయాలని నిర్ణయించింది. దీనికోసం ప్రత్యేకంగా మానిటరింగ్ విధానాన్ని అమలుచేస్తోంది. ప్రతీరోజు ఉదయం 11 గంటలకు బయోమెట్రిక్ అటెండెన్స్‌కు సంబంధించిన పూర్తి వివరాలను హెడ్ ఆఫీస్‌కు ఆన్‌లైన్‌లో పంపించాలంటూ ఆ శాఖ ఇటీవలే ఆదేశాలు జారీచేసింది. పర్మిషన్ లేకుండా లీవ్ పెట్టడం, ఆలస్యంగా విధులకు వచ్చే వారితోపాటు మధ్యలోనే విధులను పక్కనపెట్టి బయటకు వెళ్లేవారి వివరాలను కూడా తమకు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అందించాలంటూ ఆదేశాలు జారీఅయ్యాయి. హాస్పిటల్స్ సూపరింటెండెంట్ అలాగే మెడికల్ ఆఫీసర్స్ బయోమెట్రిక్ అటెండెన్స్ ప్రకారం డ్యూటీలకు డుమ్మా కొట్టేవారు అలాగే ఆలస్యంగా వచ్చేవారికి నోటీసులు జారీ చేయాలని ఆదేశాలు వెలుబడ్డాయి. దీనికి ప్రత్యేకంగా గూగుల్ ఫామ్‌ను వాట్సాప్ గ్రూప్‌లో క్రియేట్ చేశారు. ప్రతీరోజు హాస్పిటల్స్ నోడల్ ఆఫీసర్స్ కూడా వివరాలను అందించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఉపాధ్యాయులకు ఇక ఫేషియల్ రికాగ్నైజేషన్

ప్రస్తుతం విద్యాశాఖలో టీచర్ల హాజరును లైవ్ లొకేషన్ సిస్టంతో పర్యవేక్షిస్తున్నారు. పాఠశాలలో ప్రార్థన సమయం కంటే ముందుగానే ప్రతీ టీచర్ సెల్‌ఫోన్‌లో తన లైవ్ లొకేషన్ హాజరు రూపంలో నమోదుచేయాల్సి ఉంటుంది. అయితే గ్రామాల్లోని కొంతమంది టీచర్లు సిగ్నల్ రావడం లేదని లైవ్ లొకేషన్‌ను దాటేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. అలాగే మరికొంత మంది టీచర్లు పాఠశాలకు వచ్చి లైవ్ లొకేషన్‌ను నమోదు చేసిన అనంతరం తమ సెట్‌ను ఫోన్‌లో ఆఫ్ చేస్తున్నట్లు ఫిర్యాదులు ఉన్నాయి. కొంతమంది టీచర్లు లైవ్ లొకేషన్ సిస్టంపై నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని, అలాగే ఇష్టారాజ్యంగా పాఠశాలకు దూరంలో ఉంటూ లైవ్ లొకేషన్ పెడుతున్నారన్న ఆరోపణలున్నాయి. మొదట్లో లైవ్ లొకేషన్‌ను పర్యవేక్షించేందుకు కలెక్టరేట్‌లో ప్రత్యేకంగా కంట్రోల్‌రూమ్‌ను ఏర్పాటు చేశారు. అయితే ఈ కంట్రోల్ రూమ్ ద్వారా లైవ్‌లొకేషన్‌పై సరైన పర్యవేక్షణ జరగడం లేదన్న విమర్శలున్నాయి. ప్రస్తుతం లైవ్‌లొకేషన్ విధానం ఆశించిన మేర అమలు కాకపోతుండడంతో ప్రభుత్వం లైవ్‌లొకేషన్‌తోపాటు ఫేషియల్ రికాగ్నైజేషన్ విధానాన్ని తెరపైకి తేబోతోంది. ఇప్పటికే విద్యార్థుల హాజరును అమలు చేస్తుండగా ఇకపై టీచర్లు ఫేషియల్ రికాగ్నైజేషన్ ద్వారా తమ హాజరును నమోదు చేయాల్సి ఉంది. ఫేషియల్ రికాగ్నైజేషన్‌ను పర్యవేక్షించేందుకు మండల ఎంఆర్‌సీలలో ట్రాకింగ్ విభాగాన్ని కూడా ఏర్పాటు చేస్తున్నారు.



ఎఫ్ఆర్ విధానం అమలుకు సన్నాహాలు

- రామారావు, విద్యాశాఖ జిల్లా అధికారి

జిల్లాలో విద్యార్థుల హాజరు శాతాన్ని తెలుసుకునేందుకు ఫేషియల్ రికాగ్నైజేషన్ (ఎఫ్ఆర్) అమలు చేస్తున్నాం. త్వరలో ఉపాధ్యాయుల హాజరును తెలుసుకునేందుకు కూడా ఈ విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయబోతోంది. రాష్ట్రంలో మూడు జిల్లాలను పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి అమలు చేస్తోంది.



బయోమెట్రిక్ విధానాన్ని అమలు చేస్తున్నాం

- డాక్టర్ రాజేందర్, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి

తమ శాఖలో బయోమెట్రిక్ విధానాన్ని పకడ్బందీగా అమలు చేస్తున్నామన్నారు. డ్యూటీలకు ఎగనామం పెట్టే వైద్య సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేస్తున్నాం.



రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌తో చర్చిస్తున్న మహేశ్వర్‌రెడ్డి

రైల్వేలైన్‌కు కేంద్రం పచ్చజెండా

- ఆర్మూర్, నిర్మల్ రైల్వేలైన్ డీపీఆర్ సిద్ధం
- ఇప్పటికే పూర్తయిన సర్వే: బీజేఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి

నిర్మల్, జూలై 20(ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ నుంచి నిర్మల్ మీదుగా ఆదిలాబాద్ వరకు చేపట్టాల్సిన రైల్వే లైన్ నిర్మాణ పనులకు అవసరమైన నిధులు మంజూరు చేస్తానని కేంద్ర రైల్వేశాఖ మంత్రి హామీని ఇచ్చారని, దీనికి సంబంధించిన డీపీఆర్ కూడా సిద్ధమైందని బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినివైష్ణవ్ ఈ రైల్వే లైన్‌కు సంబంధించిన సర్వే, డీపీఆర్‌పై శనివారం సమీక్ష నిర్వహించారని తెలిపారు. ఇప్పటికే సర్వే పనులు పూర్తయినందున ఇక డీపీఆర్‌ను రూపొందించి తమకు పంపాలని రైల్వే శాఖ మంత్రి సంబంధిత అధికారులను ఆదేశించారని చెప్పారు. డీపీఆర్ అందగానే ఆర్థిక అనుమతులన్నీ మంజూరు చేయిస్తానని కేంద్ర మంత్రి హామీ ఇచ్చినట్లు వెల్లడించారు. కేంద్రమంత్రి హామీతో రైల్వేలైన్ నిర్మాణ పనులపై భరోసా పెరిగిందన్నారు. ఈ ప్రాంత ప్రజలు ఏళ్ల నుంచి రైల్వే లైన్ కోసం ఎదురుచూస్తున్నారని వివరించారు. కేంద్రంలోని ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం ఆర్మూర్ నుంచి నిర్మల్ మీదుగా ఆదిలాబాద్ వరకు రైల్వే లైన్ నిర్మాణం కోసం మొదటి నుండి ప్రాధాన్యతనిస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం చొరవతో నిర్మల్ ప్రజల దీర్ఘకాలిక ఆశయం నెరవేరబోతోందన్నారు. కేంద్ర మంత్రిని కలిసినవారిలో తనతోపాటు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, బీజేపీ రాష్ట్రఅధ్యక్షుడు రామచంద్రరావు, ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి, రైల్వే అధికారులు ఉన్నట్లు మహేశ్వర్ రెడ్డి వివరించారు.

సీఎంఆర్ఎఫ్‌తో పేదల ఆరోగ్యానికి భద్రత

- ముథోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి



చెక్కులను అందచేస్తున్న విఠల్‌రెడ్డి

భైంసా, జూలై20 (ఆంధ్రజ్యోతి): సీఎంఆర్ఎఫ్ పేదల ఆరోగ్యానికి భద్రత కల్పిస్తోందని మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి పేర్కొన్నారు, ఆదివారం భైంసా మండలంలోని దేగాంలో నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రాంతాల వాసులకు సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను పంపిణీ చేసిన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ అనారోగ్యపు సమస్యలతో ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రుల్లో డబ్బులు చెల్లించి వైద్యచికిత్సలు నిర్వహించుకున్న బాధితులకు ఆర్థికపరమైన ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతగానో తోడ్పాడుతోందన్నారు. పూర్తి వివరాలు, ధృవీకరణ పత్రాలతో తమను సంప్రదిస్తే సహాయం అందేలా చూస్తామని వెల్లడించారు. ఇందులో లోకేశ్వరం మండల కాంగ్రెస్ ప్రతినిధి గంగయ్య, భైంసా మండల సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు బోస్లే సాహేబార్ రావ్ పాటిల్, మాజీ జడ్పీటీసీలు బాశెట్టి రాజన్న, ఉత్తమ్ బాలేరావ్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.



అమ్మవారికి పెరుగన్నాన్ని సమర్పిస్తున్న భక్తులు

అడెల్లి పోచమ్మకు ప్రత్యేక పూజలు

సారంగాపూర్, జూలై 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని అడెల్లి పోచమ్మ దేవాలయంలో ఆదివారం భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పోచమ్మ తల్లీ దీవించమ్మా అంటూ మొక్కులను మొక్కారు. ఆలయానికి ఉమ్మడి ఆదిలాబాద్ నిజామాబాద్, మెదక్, కరీంనగర్ జిల్లాల నుంచే కాకుండా మహారాష్ట్ర నుంచి భక్తులు హాజరై అమ్మవారికి పెరుగనాన్ని నైవేద్యంగా సమర్పించారు. ఆలయానికి మొక్కును తీర్చుకోవడానికి వచ్చిన భక్తులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొకుండా ఉండడానికి ఆలయ చైర్మన్ భోజాగౌడ్, ఇన్‌చార్జీ ఈవో రమేష్ అన్ని ఏర్పాట్లు చేశారు. మొక్కులు తీర్చుకోవడానికి వచ్చిన భక్తులు జాతకాలను సరిచూసుకున్నారు. అలాగే ఆలయం వద్ద తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకున్నారు. నిర్మల్ భైంసా డిపోల నుంచి అధిక సంఖ్యలో బస్సు సౌకర్యాలు కల్పించారు.

కల్తీ పేరుతో గౌడ కులస్తులపై దాడులు ఆపాలి

- టీజీఎస్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ అమరవేణి నర్సాగౌడ్

నిర్మల్‌టౌన్, జూలై20 (ఆంధ్రజ్యోతి): గౌడ కులస్తులపై కల్తీ పేరిట దాడులను అరికట్టాలని టీజీఎస్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ అమరవేణి నర్సాగౌడ్ అన్నారు. ఆదివారం నిర్మల్ జిల్లాకేంద్రంలో గౌడజన హక్కుల పోరాట సమితి మోకుదెబ్బ జిల్లా ముఖ్యనాయకుల సమావేశం జిల్లా అధ్యక్షుడు ప్లావల గోపిగౌడ్ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ గౌడ సంఘాల జేఏసీ రాష్ట్ర చైర్మన్, మోకుదెబ్బ అధ్యక్షుడు అమరవేణి నర్సాగౌడ్ పాల్గొని మాట్లాడుతూ ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన కల్తీ కల్లు మరణాల పేదప్రజల కుటుంబాలకు, గౌడసంఘాలకు ప్రగాఢ సంతాపం, సానుభూతిని తెలియజేస్తున్నామన్నారు. కల్తీ కల్లుకు బాధ్యులైన వారిపైన కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కల్లుగీత వృత్తిని నమ్ముకుని జీవిస్తున్న గౌడకులస్తులపైన ఎక్కడో ఎక్కడో జరిగిన ఘటనను అడ్డంపెట్టుకొని రాష్ట్రవ్యాప్తంగా అబ్కారీ, పోలీస్‌శాఖల ఆధ్వర్యంలో కల్లుషాపులపై గౌడకులస్తులపై దాడులు చేస్తూ అక్రమ కేసులు పెడుతూ వేధించడం సరైంది కాదన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఆఖరికి తాటి, ఈత చెట్లు ఎక్కి జీవనాన్ని కొనసాగిస్తున్న వారిని సైతం వేధిస్తున్నారన్నారు. ఇలాంటి దాడులను వెంటనే ఆపాలని, లేనిపక్షంలో తెలంగాణ గౌడ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామన్నారు. కార్యక్రమంలో మోకుదెబ్బ రాష్ట్ర కమిటీ సభ్యులు పడాల రాజేందర్ గౌడ్, కే. బాల గౌడ్, తీగెల వెంకట్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి రవీందర్ గౌడ్, జిల్లా నాయకులు పి. శ్రీనివాస్ గౌడ్, టి. శ్రీనివాస్ గౌడ్, గడ్డం మహేందర్ గౌడ్, కే. రాజేశ్వర్ గౌడ్, మురళిగౌడ్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అమరవేణి నర్సాగౌడ్



భైంసాలో బోనంతో మైసమ్మ క్షేత్రంలో ఎమ్మెల్యే పవార్‌రామరావ్ పాటిల్



కాల్వలో బోనాలతో వెళ్తున్న మహిళలు

ఘనంగా బోనాల పండుగ

తానూర్, జూలై20(ఆంధ్రజ్యోతి): తానూర్‌లో బోనాల పండుగను ఘనంగా జరుపుకున్నారు. పెద్దమ్మతల్లికి గ్రామస్థులు, ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా బోనాల పండగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా అమ్మవారి మందిరానికి చక్కగా పూలతో అలంకరించి అమ్మవారికి పంచామృత అభిషేకంతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించి బోనాలు సమర్పించి మహాహారతి కార్యక్రమాన్ని నిర్వహించారు.

భైంసా: భైంసాలో ఆదివారం బోనాల జాతర కన్నుల పండువగా సాగింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకొన్ని పట్టణ పరిధిలోని భక్తులు మహిమాన్విత క్షేత్రం గట్టు మైసమ్మ క్షేత్రం, మహాలక్ష్మీ మందిరం, పోచమ్మ ఆలయాల్లో భక్తిశ్రద్ధలతో బోనాలను సమర్పించారు. ఆయా కాలనీల్లోని మహిళలు నెత్తినబోనాలతో ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేపట్టి బోనాలను సమర్పించారు. కాలనీల్లోని ప్రధాన కూడలీల నుంచి శోభాయాత్రగా మైసమ్మ క్షేత్రానికి తరలివెళ్లారు. శోభయాత్రలో పోతరాజుల విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మైసమ్మ క్షేత్రంలో ముథోల్ ఎమ్మెల్యే పవార్‌రామరావ్ పాటిల్ హిందూ ఉత్సవ సమితి అధ్యక్షులు పెండెపు కాశీనాథ్, బీజేపీ శ్రేణులతో కలిసి వెళ్లి బోనం సమర్పించారు. భైంసా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సిందే ఆనంద్‌రావ్ పాటిల్ కాంగ్రెస్ శ్రేణులతో కలిసి, బీఆర్ఎస్ ముథోల్ నియోజక వర్గ సమన్వయ కమిటీ ప్రతినిధి విలాస్ గాదేవార్ పార్టీ శ్రేణులతో కలిసి బోనాల జాతరలో పాల్గొని గట్టుమైసమ్మ క్షేత్రంలో ప్రత్యేక పూజలుచేపట్టారు. బోనాల జాతరకు పట్టణ సీఐ గోపినాథ్ ఆధ్వర్యంలో పోలీసుశాఖ బందోబస్తు చర్యలు చేపట్టింది.

నిర్మల్‌రూరల్: పట్టణంలో ఆదివారం బోనాలు వైభవంగా నిర్వహించారు. వాడవాడల్లో సంఘాల వారిగా బోనాలు ఎత్తుకొని ఊరేగింపుగా మహాలక్ష్మి అమ్మవారి ఆలయం, మారెమ్మ ఆలయం వద్ద అమ్మవారి దర్శనానికి భక్తులు బారులు తీరారు. శివసత్తుల విన్యాసాలు, పోతురాజుల నృత్యాలు అలరించారు.



తానూర్‌లో పూజలు నిర్వహిస్తున్న గ్రామస్థులు

దిలావర్‌పూర్: ఆషాఢ మాసం చివరి ఆదివారం కావడంతో మండలంలోని కాల్వలో మహిళలు గ్రామ దేవతలకు సామూహిక బోనాలు సమర్పించారు. గ్రామంలోని మహిళలు కొత్త కుండల్లో ప్రత్యేకంగా తయారు చేసిన నైవేద్యం అమ్మవారికి సమర్పించేందుకు శోభాయాత్రగా బయలుదేరారు. శ్రీ మహా పోచమ్మ, శ్రీ మహాలక్ష్మి, ముత్యాలమ్మ అమ్మవార్లకు బోనాలు సమర్పించారు. సమృద్ధిగా వర్షాలు కురువాలని, పాడి పంటలు, పిల్లా జెల్లా బాగుండాలని అమ్మవార్లకు మొక్కుకున్నారు. అనంతరం అందరూ కలిసి అక్కడే సామూహిక భోజనాలు చేశారు.



విగ్రహాలకు పూజలు నిర్వహిస్తున్న గ్రామస్థులు

ఘనంగా గ్రామ దేవతల విగ్రహ ప్రతిష్ఠాపన

బాసర,జూలై 20(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో గ్రామదేవతల విగ్రహ ప్రతిష్ఠాపణ కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. పాతవిగ్రహల స్థానాల్లో కొత్త విగ్రహాలను ఏర్పాటు చేసిన గ్రామస్థులు ఈ క్రతువును వేదపండితులు మంత్రోచ్ఛరణతో దేవతామూర్తులను స్థాపించారు. యాగ పూజలను నిర్వహించారు. గ్రామస్థులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఎడ్‌బిడ్ తండాలో సీత్లా పండుగ

ముథోల్, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎడ్‌బిడ్ తండాలో ఆదివారం గిరిజనుల ఆరాధ్య పండుగైన శీత్లా భవాని పండుగ వేడుకలను గిరిజనులు ఘనంగా జరుపుకున్నారు. ఎడ్‌బిడ్ తాండలో ప్రతీ ఏడాది ఆనవాయితీగా, సంప్రదాయబద్ధంగా ఆషాఢ మాసంలో జరుపుకునే శీత్లా పండుగను వైభవంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా దేవతలు కరుణించాలని, విరివిగా వర్షాలు కురవాలని, పాడి పంటలతో గ్రామాలు చల్లగా ఉండాలని కులదేవతలను వేడుకుంటూ గిరిజనులు శీత్లా పండుగను నిర్వహించారు. తండాలో ప్రత్యేక పూజలు చేశారు. వంటకాలు తయారుచేసి డప్పు వాయిద్యాలతో ఊరేగింపుగా గ్రామ పొలిమేరలో ఉన్న దేవతలకు నైవేద్యం సమర్పించారు. గ్రామ పొలిమేరలో మేకలను బలిచ్చి తమ మొక్కులు తీర్చుకున్నారు. వంటకాలను పశువులపై చల్లి ఎటువంటి సమస్యలు రాకుండా చూడాలని, స్థానికులు అనారోగ్య బారిన పడకుండా కాపాడమని వేడుకున్నారు. కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ ధూమ్ నాయక్, గజానంద్ నాయక్, శ్యామ్‌రావు, గణేష్ రాథోడ్, అర్జున్, అమర్ సింగ్, బాబు, రాంనాథ్, లచ్చారాం, మహిళలు, గ్రామస్థులు పాల్గొన్నారు.



పండుగ వేడుకలను జరుపుకుంటున్న దృశ్యం



ఎన్నికైన కార్యవర్గం ఇదే..

భారతీయ కిసాన్ సంఘ్ మండల కార్యవర్గం ఎన్నిక

ముథోల్, జూలై20 (ఆంధ్రజ్యోతి): భారతీయ కిసాన్ సంఘ్ ముథోల్ మండల కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా జంబుల సాయి ప్రసాద్, వైస్‌ప్రెసిడెంట్‌గా బుజిగిరి దిగంబర్, కార్యదర్శిగా బి.సాయన్న, సహ కారదర్శిగా శ్రీధర్‌రెడ్డి, సాయినాథ్ ఎన్నికైనట్లు తెలిపారు. కార్యక్రమంలో నిర్వాహకులు, జిల్లా కార్య దర్శి కొరిపెల్లి శ్రీనివాస్ రెడ్డి, ఎం. గంగాధర్, విఠల్‌రెడ్డి, నాయకులు రమేష్, జీవన్, అనిల్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

కుబీర్, జూలై20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పార్డి(కే) గ్రామానికి చెందిన మెట్‌పెల్లి శ్రీనివాస్(33) ఆదివారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. గ్రామస్థుల కథనం ప్రకారం.. శ్రీనివాస్ కొంతకాలంగా పనిచేయకపోవడంతో మద్యానికి బానిసైయ్యాడు. 15 రోజుల క్రితం భార్యతో గొడవపడి పార్డి(కే)లోనే ఉంటున్నాడు. ఈ క్రమంలో ఆదివారం గ్రామ శివారులోని ఒక రేకుల షెడ్‌లో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య మెట్‌పెల్లి గంగసాగర ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మనస్థాపంతో మరొకరు..

కుంటాల, జూలై 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్లూరులో ఆదివారం వెగ్గలం సాయినాథ్ (38) యువకుడు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డట్లు ఎస్సై అశోక్ తెలిపారు. కుటుంబీకులు, పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. సాయినాథ్ ఇటీవల కొత్తగా ఇంటి నిర్మాణం పనులు చేపడుతున్నాడు. అయితే ఇల్లు నిర్మాణం పూర్తయి ప్లాస్టింగ్ చేయాల్సి ఉంది. ఇదివరకు ఇంటి నిర్మాణం కోసం కొన్ని అప్పులు తెచ్చాడు. ఇంటి నిర్మాణం పూర్తి చేయాలంటే మరికొంత అప్పు చేయాల్సి ఉంది. పాత అప్పులు తీరనిదే కొత్తగా అప్పు ఎలా తీసుకురావాలని మనస్థాపానికి గురై గత కొద్ది రోజుల నుండి మద్యానికి బానిసయ్యాడు. ఆదివారం ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డట్లు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.